


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 182 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 8 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :182 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 8 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కొత్తగా ఆలోచించే వారి కోసం
# 'క్రియేటివ్ సిటీ'

### సీఎం చంద్రబాబు ప్రకటన



- ఢిల్లీలో రైసినా డైలాగ్-2026 సదస్సు
- ఈ సదస్సుకు హాజరైన తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఘనత
- త్వరలో అమరావతి వేదికగా గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు
- సాంకేతికతతో భారత్‌కు రివర్స్ మైగ్రేషన్ తప్పదని సీఎం వెల్లడి
- దక్షిణాదిలో తగ్గుతున్న జననాల రేటును పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

**పెన్ పవర్ డెస్క్:**"విభిన్నంగా ఆలోచించే వారి కోసం, సృజనాత్మకతకు పెద్దపీట వేసే మేధావుల కోసం అమరావతిలో అత్యాధునికమైన 'క్రియేటివ్ సిటీ'ని నిర్మిస్తున్నాం. కేవలం పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్-2026' సదస్సులో పాల్గొన్న ఆయన, తన ప్రసంగంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక విషయాలను ప్రపంచ దేశాల ప్రతినిధులతో పంచుకున్నారు. అమరావతిలో కేవలం భవనాలు మాత్రమే ఉండవని, అక్కడ డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలు కొలువుదీరుతాయని

మిగతా 2లో



## జగన్ ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు

- తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్న సజ్జల
- తమ హయాంలో తిరుమలలో క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని వెల్లడి
- బీఆర్ నాయుడు విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ ను రాజకీయంగా ఎదుర్కోలేకే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంపై కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.లడ్డూ ప్రసాదంలో జంతువుల

మిగతా 2లో



## జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- ప్రజలను వంచించడానికే ఆ హామీ అన్న లోకేశ్
- ప్రతి నెల రూ. 100 కోట్ల ముడుపులు అందాయని ట్వీట్
- రూ. 3,500 కోట్ల లాండరింగ్ జరిగిందన్న లోకేశ్

**పెన్ పవర్ డెస్క్:**గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక అసలు కథ వేరే ఉందని, ఆ హామీ కేవలం ప్రజలను వంచించడానికేనని లోకేశ్ ఆరోపించారు. ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని, గత ఐదేళ్లలో జరిగిన అవినీతి చిట్టాను ఆయన బయటపెట్టారు. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాల క్లిప్పింగ్ లను కూడా లోకేశ్ తన ట్వీట్ లో పంచుకున్నారు.మద్యం వ్యాపారం ద్వారా ప్రతి నెలా సుమారు వంద కోట్ల రూపాయల మేర ముడుపులు అందాయని, మొత్తంగా 3,500 కోట్ల రూపాయల మేర మనీ లాండరింగ్ జరిగిందని

మిగతా 2లో

## హోర్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై
# ఇరాన్ దాడి...

### మరింత ముదిరిన ఉద్రిక్తతలు

- హోర్ముజ్ జలసంధిలో 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో డ్రోన్‌తో విరుచుకుపడ్డ ఆర్మీ
- శత్రు దేశాల నౌకలకు జలసంధిలో అనుమతి లేదన్న ఇరాన్
- గత ఎనిమిది రోజులుగా జలసంధి తమ ఆధీనంలోనే ఉందన్న ఐఆర్‌జీసీ
- జలసంధిని పూర్తిగా మూసివేయలేదని ఇరాన్ ప్రభుత్వం స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. శనివారం హోర్ముజ్ జలసంధి గుండా వెళుతున్న 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దాడి చేసింది. తమ హెచ్చరికలను బేఖాతరు చేసినందుకే ఈ నౌకపై దాడి చేశామని ఇరాన్ సైన్యం ప్రకటించింది.

మిగతా 2లో





## ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

- డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో లక్ష్మీదుర్గను ఏ-2గా చేర్చిన సిట్ అధికారులు
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ కోర్టులో ఛార్జిషీట్
- కోర్టు ఆదేశాలతో లక్ష్మీ దుర్గ కోసం ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసు కుంది. ఈ కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గకు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

మిగతా 2లో




## చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- జయసుధకు ఏఎన్నార్ అవార్డు
- ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
- ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)
- ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
- ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)

**పెన్ పవర్ డెస్క్:**2025లో విడుదలైన చిత్రాలకు సంబంధించి 'గద్దర్ ఫిలిం అవార్డ్స్-2025' విజేతలను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. జ్యూరీ సభ్యులు విజేతల పేర్లను ప్రకటించారు. మెగాస్టార్ చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. 2025 జనవరి 1 నుంచి

మిగతా 2లో




## చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- చంద్రబాబు జనాభా విధానంపై వైఎస్ షర్మిల వ్యంగ్యం
- ఉన్న పిల్లలకే దిక్కులేదు.. ఇప్పుడు ముగ్గురు ఎందుకని ప్రశ్న
- నిరుద్యోగులు ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటున్నారని ఆవేదన
- రాష్ట్ర అప్పులు 12 లక్షల కోట్లకు చేరాయని మండిపాటు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జనాభా నియంత్రణ ఎత్తివేత, ఎక్కువ మంది పిల్లలను కనడంపై అసెంబ్లీలో చేసిన ప్రకటన పట్ల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యంగ్యంగా స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతుంటే, ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనమని చెప్పడం ఎంతవరకు


మిగతా 2లో

## భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న మూడో దేశంగా భారత్
- గతేడాదితో పోలిస్తే కొత్తగా చేరిన మరో 24 మంది కుబేరులు
- ఏకంగా రూ.112.6 లక్షల కోట్లకు చేరిన మొత్తం సంపద
- హెల్త్‌కేర్ రంగం నుంచే అత్యధికంగా కొత్త బిలియనీర్లు
- ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను కోల్పోయిన ముంబై

**పెన్ పవర్ డెస్క్:**భారత్‌లో సంపన్నుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. తాజాగా విడుదలైన 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2026' ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా తర్వాత భారత్ ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం దేశంలో మొత్తం 308 మంది బిలియనీర్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. దేశంలో సంపద సృష్టి, ఆర్థిక వృద్ధి బలంగా ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి

మిగతా 2లో





## సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతనం.. ప్రపంచంలోనే అత్యధిక జీతం!
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతన ప్యాకేజీ ప్రకటన
- రాబోయే మూడేళ్లలో రూ. 6,361 కోట్లు ఆర్జించే అవకాశం
- కంపెనీ పనితీరు ఆధారంగా రెట్టింపు కానున్న స్టాక్ యూనిట్లు
- వేమో, వింగ్ వంటి అటానమస్ వెంచర్ల వృద్ధికి ప్రోత్సాహకాలు

మిగతా 2లో



## ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

- ఎనిమిదో రోజుకు చేరుకున్న యుద్ధం
- ఇప్పటి వరకు చేసిన దాడికి 'సారీ' అన్న పెజెష్కియాన్
- గల్ఫ్ దేశాలపై ఇక దాడులు చేయబోమన్న అధ్యక్షుడు
- పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం ప్రతిదాడి చేస్తామని హెచ్చరిక

## ఎడిటర్ వ్యూ

# గల్ఫ్ బాధితులకు రక్షణ ఏదీ?

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులతో పశ్చిమాసియా దేశాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. భీకర యుద్ధం జరుగుతున్న ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో సుమారు కోటి మంది భారతీయులు భిక్కుభిక్కుమంటూ దినమెక గండంగా గడుపుతున్నారు. గల్ఫ్ దేశాల్లో అత్యధికంగా యూఏఈ (దుబాయి)లో 43 లక్షలు, సౌదీ అరేబియాలో 27 లక్షలా 47 వేలు, ఖతార్, కువైట్..ఇలా ఆయా దేశాల్లో లక్షల సంఖ్యలో మన భారతీయులు ఉద్యోగ, ఉపాధి కోసం వలస వెళ్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. నిత్యం మిస్సైళ్ల వర్షం కురుస్తున్న ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల్లోనూ యాభై వేల మంది వరకు భారతీయులున్నట్లు అంచనా. ఈ రెండు దేశాల్లో మరింత భయానక వాతావరణం నెలకొన్నట్లు స్పష్టమౌతుంది. రానున్న రోజుల్లో మరింత భీకర యుద్ధం జరిగే అవకాశాలున్నట్లు ప్రస్తుత పరిస్థితులను బట్టి అర్థం చేసుకోవచ్చు. పొట్ట చేతపట్టుకుని గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయుల్లో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వారే ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో రోజు వారి కూలీగా చేరిన వారే ఎక్కువగా ఉన్నారు. షిప్పింగ్, పోర్టు కంపెనీల్లో భారతీయులు పనిచేస్తున్నారు. వారి పరిస్థితి ముందు నుయ్యి-వెనుక గొయ్యిలా మారింది. ఇప్పటికే దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతి చెందినట్లు వార్తలొచ్చాయి. యుద్ధ వాతావరణంలో బయట పనులు చేయలేని పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితుల్లో వారి జీవన మనుగడ అత్యంత క్లిష్టంగా మారినట్లు తెలుస్తోంది. స్వస్థలాల్లో అప్పులు చేసి గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయులకు ప్రస్తుత యుద్ధవాతావరణంలో మన ప్రభుత్వాల నుండి భరోసా లభించడం లేదు. ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో యూఏఈ పాలకులు ప్రవాసీయులకు కొంత భరోసా కల్పిస్తున్నారు. విమానాలు రద్దయినందున ఆయా హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని బలవంతంగా ఖాళీ చేయించవద్దని ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్కడి ప్రజలకు కొంత సహకారం అందిస్తున్నారు. కాగా..మన భారత ప్రధాని పలు దేశాధినేతలతో ఫోన్లో మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. ఢిల్లీలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. వీటితో చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న భరతీయులకు రక్షణతో పాటు ఇక్కడి కుటుంబాలకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలేవీ కనిపించక పోవడం బాధాకరం. గల్ఫ్ దేశాల్లో భారతీయులు తీవ్ర భయాందోళనలో భిక్కు భిక్కుమంటూ గడుపుతున్న నేపథ్యంలో భారత ప్రధాని పుదుచ్చేరి, తమిళనాడు, కెనడా పర్యటనలు చేశారు. కేంద్ర మంత్రులు సైతం సొంత నియోజక వర్గాల పర్యటనలకే పరిమితమైనట్లు తెలుస్తోంది. దీంతో ఆయా దేశాల్లోని భారతీయుల బాగోగులు పట్టించుకునే వారే కరువయ్యారనే విమర్శలున్నాయి. దేశ వ్యాప్తంగా ఆయా పార్లమెంటు నియోజక వర్గాల వారీగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి..ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి భరోసా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీంతో పాటు గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులకు రక్షణతో పాటు అహారం, ఇతర అవసరాలు తీర్చేలా కార్యచరణ చేపట్టాల్సి ఉంది. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావం భారత్‌పై ఏ మేరకు పడుతుందనే అందోళన నెలకొంది. ప్రధానంగా హోర్మూజ్ జలసంధి మూసివేతతో చమురు ట్యాంకర్ల నిలిపివేత ప్రభావం ధరల పెరుగుదలకు కారణమయ్యే అవకాశాలున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే బ్యారెల్ ధర 80 డాలర్లకు పెరిగిందని, క్రమ క్రమంగా మరింత పెరిగే అవకాశాలు లేక పోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచబోమనే కేంద్ర ప్రభుత్వ ప్రకటన కోసం దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పెట్రో ఉత్పత్తులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాభై శాతం వ్యాట్‌ను వసూలు చేస్తున్నందున ప్రపంచ మార్కెట్‌లో క్రూడ్ అయిల్ ధర పెరిగినా నష్టాలు మాత్రం వచ్చే అకాశాలు లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ బహిరంగ మార్కెట్‌లో పెట్రో ధరలను ప్రభుత్వం పెంచితే..అనివార్యంగా సరుకులు, వస్తువుల ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. ఈ ప్రభావం దేశవ్యాప్త ఆందోళనలకు దారితీసే అవకాశాలున్నాయి.

## జగన్ ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

కొవ్వు, కెమికల్స్ కలిపారంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని సజ్జల కొట్టిపారేశారు. వైసీపీ హయాంలోనే తిరుమలలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మార్కెట్‌లో హెరిటేజ్ నెయ్యి ధర కంటే ఇందాపూర్, అమూల్ నెయ్యి ధరలు తక్కువగా ఉన్నాయని... కేవలం కొన్ని సంస్థలకు లబ్ధి చేకూర్చడానికే నెయ్యి కాంట్రాక్టుల విషయంలో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. నెయ్యి కాంట్రాక్టుల వెనుక భారీ ఆర్థిక కుంభకోణం దాగి ఉందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని సజ్జల డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసి స్వామివారి సొమ్మును దోచుకోవడమే ఈ విష ప్రచారం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విమర్శించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి సంబంధించిన వీడియోల వివాదంపై సజ్జల స్పందిస్తూ... గతంలో తమ హయాంలో సినీ నటుడు పృథ్వీపై ఆరోపణలు రాగానే తక్షణమే రాజీనామా చేయించామని, కానీ ఇప్పుడు బీఆర్ నాయుడి విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ నాయుడు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భక్తుల విశ్వాసాలపై చంద్రబాబుకు విశ్వాసం లేదనే విషయం మరోసారి అర్థమయిందని అన్నారు.

# సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ, భారత సంతతికి చెందిన సుందర్ పిచాయ్ ప్రపంచంలోనే అత్యధిక వేతనం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్‌లలో ఒకరిగా నిలిచారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఆయనకు రాబోయే మూడేళ్ల కాలానికి గాను ఏకంగా 692 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 6,361 కోట్లు) భారీ వేతన ప్యాకేజీని ప్రకటించింది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ ప్యాకేజీ ఆయన పనితీరు, కంపెనీ వృద్ధి లక్ష్యాలతో ముడిపడి ఉండటం విశేషం. ఈ భారీ ప్యాకేజీలో ఎక్కువ భాగం పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలో ఉంది. దీని విలువ 126 మిలియన్ డాలర్లు. ఎస్‌డపీ 100 సూచీలోని ఇతర కంపెనీలతో పోలిస్తే ఆల్ఫాబెట్ షేర్ హోల్డర్లకు లభించే రాబడి ఆధారంగా ఈ ప్యాకేజీ విలువ మారుతుంది. కంపెనీ పనితీరు లక్ష్యాలను అధిగమిస్తే, ఈ విలువ రెట్టింపు అయి 252 మిలియన్ డాలర్లకు చేరవచ్చు. ఒకవేళ లక్ష్యాలను అందుకోకపోతే దీని విలువ సున్నా కూడా కావొచ్చు. దీనికి అదనంగా సుందర్ పిచాయ్‌కు మూడేళ్ల కాలానికి 84 మిలియన్ డాలర్ల విలువైన రిస్ట్రిక్టెడ్ స్టాక్, వార్షిక వేతనంగా 2 మిలియన్లు అందనున్నాయి.

కంపెనీలోని అటానమస్ (స్వయంప్రతిపత్త) వెంచర్లైన వేమో, వింగ్ ఏవియేషన్ వృద్ధికి ఊతమిచ్చేలా ఆల్ఫాబెట్ కొత్తగా 350 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ ప్రోత్సాహకాలను కూడా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పిచాయ్‌కు వేమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్, వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల షేర్లు లభిస్తాయి. ఈ వెంచర్ల పనితీరు అద్భుతంగా ఉంటే ఈ స్టాక్స్ విలువ 200 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. డ్రైవర్‌లెస్ కార్లు, డెలివరీ డ్రోన్స్ వంటి క్లిష్టమైన రంగాలలో సుందర్ పిచాయ్ నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఆల్ఫాబెట్ బోర్డు ఈ సందర్భంగా పేర్కొంది. 2015 ఆగస్టులో సీఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుందర్ పిచాయ్, గూగుల్ మార్కెట్ విలువను దాదాపు ఏడు రెట్లు పెంచారు. అప్పట్లో 535 బిలియన్ డాలర్లుగా ఉన్న మార్కెట్ క్యాప్, ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. 53 ఏళ్ల పిచాయ్ 2004లో గూగుల్‌లో చేరి క్రోమ్, ఆండ్రాయిడ్ వంటి కీలక విభాగాలను విజయవంతంగా నడిపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల (96.5 మిలియన్ డాలర్లు), యాపిల్ సీఈఓ టిమ్ కుక్ (74.3 మిలియన్ డాలర్లు) వంటి వారి వార్షిక వేతనాలతో పోలిస్తే పిచాయ్ ప్యాకేజీ చాలా అధికం కావడం గమనార్హం.

# ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది.ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు. "ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరఫున, ఇరాన్ ప్రజల తరఫున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

పొరుగు దేశాలపై దాడులు చేయడం తమ ఉద్దేశం కానేకాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో గల్ఫ్ దేశాలపై దాడులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.ఇరాన్ లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కూడా పెజెష్కియాన్ స్పందించారు. టెహ్రాన్ లొంగిపోయే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లేదా ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే వారి కలలను వారు సమాధి చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

# కొత్తగా ఆలోచించే వారి కోసం 'క్రియేటివ్ సిటీ'

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో 'సాంకేతికత - సుపరిపాలన - భవిష్యత్తు' అనే అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2016 నుంచి జరుగుతున్న ఈ సదస్సుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న చంద్రబాబు, ఏపీని 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్'గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ డేటా సెంటర్లతో పాటు, ఆరోగ్య రంగంలో డ్రోన్ అంబులెన్సులు వంటి విప్లవాత్మక మార్పులు ఏపీలో ఇప్పటికే రియాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తూ, ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు.

### అవకాశాల గనిగా భారత్

ప్రపంచవ్యాప్తంగా భారతీయులు కీలక స్థానాల్లో ఉన్నారని, అనేక దేశాల అభివృద్ధిలో మనవారి పాత్ర మరువలేనిదని సీఎం కొనియాడారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలను వేగంగా అందిపుచ్చుకోవడం వల్లే భారత్ అగ్రగామిగా ఎదుగుతోందన్నారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు భారత్ నుంచి మేధో వలస జరిగిందని, కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం, వనరులు ఉన్నచోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, త్వరలోనే భారత్‌కు 'రివర్స్ మైగ్రేషన్' మొదలవుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 60 శాతం భారత్‌లోనే ఉండటం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు విద్యుత్ ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

### జనాభా నిర్వహణపై డేంజర్ బెల్స్

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వృద్ధుల జనాభా పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ఏపీలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చంద్రబాబు వివరించారు. ఒకప్పుడు ప్రజాప్రతినిధిగా కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసిన తాను, నేడు 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' (జనాభా నిర్వహణ) ఆవశ్యకత గురించి మాట్లాడుతున్నానని తెలిపారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోయిందని, దీనిని కనీసం 2.1కి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త పాలసీని తీసుకొచ్చామని చెప్పారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలంతా జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయంతో పాటు, నెలకు రూ.1000 అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై కూడా ఆలోచన చేస్తున్నామన్నారు. గతంలో దేశానికి ఆస్తిగా ఉన్న పెద్ద కుటుంబాలు ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారిపోయాయని, ఈ విషయంలో ప్రజల ఆలోచనా దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ సహా 110 దేశాల నుంచి వచ్చిన 2700 మందికి పైగా ప్రతినిధులు, మేధావులు, వ్యూహకర్తలు హాజరైన ఈ సదస్సులో చంద్రబాబు ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రంతోనూ, పొరుగు రాష్ట్రాలతోనూ సమన్వయం చేసుకుంటూ ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సీఎం వివరించారు.

# భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- మొదటి పేజి తరువాయి

.గతేడాదితో పోలిస్తే ఈసారి కొత్తగా 24 మంది బిలియనీర్ల జాబితాలో చేరారు. దీంతో భారతీయ కుబేరుల మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు (112.6 ట్రిలియన్లు) చేరింది. 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపద తగ్గడం లేదా స్థిరంగా ఉండటం గమనార్హం. ఈసారి సంప్రదాయ రంగాలకు మించి ఇతర రంగాల వారు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నారు. అత్యధికంగా హెల్త్‌కేర్ రంగం నుంచి 53 మంది, ఇండస్ట్రియల్ గూడ్స్ నుంచి 36 మంది, కన్స్యూమర్ గూడ్స్ నుంచి 31 మంది కొత్తగా ఈ జాబితాలో చేరారు. అయితే తక్కువ మంది ఉన్నప్పటికీ, ఇంధన రంగం (ఎనర్జీ) అత్యధిక సంపదను కలిగి ఉంది. కేవలం 8 మంది బిలియనీర్లే రూ.18.3 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుల మొత్తం సంపదలో 16 శాతం వాటాను కలిగి ఉన్నారు. నగరాల వారీగా చూస్తే ముంబై 95 మంది బిలియనీర్లతో దేశంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను మాత్రం ముంబై కోల్పోయింది. 133 మంది కుబేరులతో చైనాలోని షెన్‌జెన్ నగరం ఆసియాలో టాప్ ప్లేస్‌కు చేరింది. ముంబైలో కొత్తగా 15 మంది బిలియనీర్లు చేరగా, ఇది న్యూయార్క్ (14), లండన్ (9) కంటే ఎక్కువ కావడం విశేషం. ఇక భారతీయ బిలియనీర్లలో మహిళల వాటా 7 శాతంగా ఉంది. మొత్తం 23 మంది మహిళా కుబేరుల వద్ద రూ.9.8 లక్షల కోట్ల సంపద ఉన్నట్లు హురున్ నివేదిక తెలిపింది. ప్రపంచ సగటు వయసు (65) కంటే భారతీయ బిలియనీర్ల సగటు వయసు (67) ఎక్కువగా ఉండటం గమనార్హం.

# హోర్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి...

- మొదటి పేజి తరువాయి

షిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం.. భద్రతా కారణాల దృష్ట్యా హోర్ముజ్ జలసంధిలో రాకపోకలను నిషేధిస్తూ ఇరాన్ నేవీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే 'ప్రైమా' ట్యాంకర్ ఈ నిబంధనలను ఉల్లంఘించి ముందుకు సాగడంతో, ఐఆర్‌జీసీ డ్రోన్ ద్వారా ఆ నౌకపై దాడి చేసింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించిన తర్వాత, గత ఎనిమిది రోజులుగా హోర్ముజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని ఐఆర్‌జీసీ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ వంటి శత్రు దేశాలకు చెందిన లేదా వాటికి మద్దతు తెలిపే వాణిజ్య నౌకలను ఈ మార్గంలో అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే, హోర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు వస్తున్న వార్తలను ఇరాన్ ప్రభుత్వం ఖండించింది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే నౌకల రాకపోకలు జరుగుతున్నాయని, జలసంధిని పూర్తిగా మూసివేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే తెలిపారు. కానీ, యుద్ధ సమయంలో జలసంధిని నియంత్రించే హక్కు తమకు ఉందని, అమెరికా, ఇజ్రాయెల్ నౌకలు లేదా మారువేషంలో వచ్చే యుద్ధ నౌకలను మాత్రం సైనిక లక్ష్యాలుగా పరిగణించి అడ్డుకుంటామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రతరం చేయడంతో ఈ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

# చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- మొదటి పేజి తరువాయి

డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలు, షార్ట్ ఫిలింలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలను అందజేయనున్నారు.

**స్పెషల్ అవార్డులు:**

ఎన్టీఆర్ జాతీయ అవార్డు - చిరంజీవి
ఏఎన్నార్ అవార్డు - జయసుధ
పైడి జయరాజ్ అవార్డు - కమల్ హాసన్
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వనిదత్

**ఫీచర్ ఫిల్మ్:**

ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ ద్వితీయ చిత్రం - దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం - ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్‌షో
ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ బాలనటుడు - మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ సహాయ నటుడు - శివాజీ
ఉత్తమ సహాయనటి - భూమిక (యూఫోరియా)
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ - తండేల్
ఉత్తమ సోషల్ మెసేజ్ సినిమా - కోర్ట్
ఉత్తమ ప్రజాదరణ చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ డాక్యుమెంటరీ - యూనిటీ
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ పరిచయ దర్శకుడు - సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలల చిత్రం - అనగనగా
ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్ (దండోరా)
ఉత్తమ గాయకుడు - అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ గాయని - సాహితీ (కన్నప్ప)
ఉత్తమ కథా రచయిత - గుణశేఖర్ (యుఫోరియా)
ఉత్తమ స్క్రీన్‌ప్లే - అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ లిరిసిస్ట్ - నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ - కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్ - శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్).
ఉత్తమ సినీ గ్రంథం: ప్రభు (శూన్యం నుండి శిఖరాగ్రాలకు)
ఉత్తమ సినిమా విమర్శకుడు: హెచ్ రమేశ్ బాబు

# జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- మొదటి పేజి తరువాయి

లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే 1,048 కోట్ల రూపాయల నగదు లావాదేవీల జాడను వెలికితీసిందని గుర్తుచేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో జగన్ మద్య నిషేధం గురించి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు ఆయన అనుచరులు అక్రమ మద్యం ద్వారా వేల కోట్లు గడించారని మండిపడ్డారు. ఈ క్రమంలో వేలాది పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలకు ఈ దోపిడీపై సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండిపోతారా? అంటూ జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న సంధించారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

- మొదటి పేజి తరువాయి

గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు సిట్ అధికారులు ఈ కేసులో దర్యాప్తును లోతుగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గను ఈ కేసులో రెండవ నిందితురాలిగా (ఏ-2) చేర్చారు. ఈ మేరకు సిట్ అధికారులు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసులు సమర్పించిన ఛార్జిషీట్‌ను, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. లక్ష్మీ దుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టు ఆదేశాలు వెలువడిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం లక్ష్మీ దుర్గ ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- మొదటి పేజి తరువాయి

సమంజసమని ఆమె ప్రశ్నించారు. "చంద్రబాబు పాపులేషన్ పాలసీ హాస్యాస్పదం. ఉన్న బిడ్డలకే దిక్కులేదు... ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనాలా? మీరిచ్చే బోడి 25 వేల కోసం మూడో బిడ్డను కనమంటారా? ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆటోలు తోలుకుంటూ, ట్యాక్సీ డ్రైవర్లుగా బ్రతుకుతున్నారు. రాష్ట్రంలో మీరిచ్చిన హామీలు అమలు కాలేదు. మీరు, జగన్ గారు కలిసి రాష్ట్రాన్ని 12 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవు. ఉద్యోగుల జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఆరోగ్య శ్రీ పథకానికి 3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 6 వేల కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారు. మాఫియాలు చేసుకుంటూ, రాష్ట్రాన్ని దోచుకుంటూ... బిడ్డలను కనమని చెబితే ఎలా చంద్రబాబు గారూ?" అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

# రైతుల సంతోషమే కూటమి లక్ష్యం

-చంద్రబాబు ఆ ఉద్దేశంతోనే పనిచేస్తున్నారు
-నాలుగైదు నెలల్లో రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కారం
-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
-చిన్నఓగూరులో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ
-333 మందికి పుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టర్ హిమవంశీ




**కందుకూరు పెన్ పవర్, మార్చి 7:**
రాష్ట్రంలో ఉన్న రెవెన్యూ సమస్యలన్నీ నాలుగైదు నెలల్లో పూర్తిగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక రెవిన్యూ సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. కందుకూరు మండలం చిన్నఓగూరులోని సచివాలయం వద్ద మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా 333 మంది రైతులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు , సబ్ కలెక్టర్ హిమవంశీతో కలిసి పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాసుపుస్తకాల మీద ముద్రించిన జగన్ బొమ్మ తీసేసి, రాజముద్రతో కూడిన పుస్తకాల అందిస్తున్నామని తెలిపారు. రీ సర్వేలో వచ్చిన తప్పులన్నిటికీ జగన్ చేతగానితనమే కారణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను పరుగులు పెట్టిస్తూ, నాలుగైదు నెలల్లో తప్పులన్నీ సరిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పాస్ పుస్తకాలలోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా... పొలం స్థితిగతులను తెలుసుకోవచ్చని చెప్పారు. రెవెన్యూ శాఖలో చంద్రబాబు తీసుకొచ్చిన సంస్కరణలను ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతోందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు, అన్నదాత సుఖీభవ కింద రెండుసార్లు నిధులు విడుదల చేసామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం అమ్మితే ఏడాది వరకు నగదు కోసం రైతుల ఎదురు చూసేవాళ్ళని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయని వివరించారు.కందుకూరు నియోజకవర్గంలో 30 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న నేతలు, కందుకూరు మండలానికి తాగునీరు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రశ్నించారు. తాను స్వయంగా చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి, జలజీవన్ మిషన్ ద్వారా మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి 22 కోట్లు మంజూరు చేయించానని ఎమ్మెల్యే తెలియజేశారు. టెండర్లు పూర్తయి పనులు మొదలయ్యాయని, మరో ఏడాదిలో రూరల్ గ్రామాలన్నిటికీ సురక్షిత తాగునీరు అందుతుందని ఆయన స్పష్టం చేశారు. సబ్ కలెక్టర్ హిమవంశీ చక్కగా పనిచేస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పొగడ్తలతో ముంచెత్తారు. రెవెన్యూ అధికారులు ఆయనలాగా బాధ్యతతో పనిచేయాలని సూచిస్తూ, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఓగూరు చెరువు సమస్య గురించి స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చెరువుకు నీరు వచ్చే కాలువలు అన్ని పూడిపోయాయని, అందువలన నీరు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుకు నీరు వచ్చే కాలువలు అన్నింటినీ బాగు చేయించి, రైతులను తప్పక ఆదుకుంటామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారికి హామీ ఇచ్చారు. అంతకుముందు ఓగూరు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ హిమవంశికి గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసిల్దార్ మురళి, సర్పంచ్ కొండమ్మ, ఎంపిటిసి అల్లం సుమతి, ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోగినేని వెంకటేశ్వర్లు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు, అల్లం రాధయ్య, రాయపాటి శ్రీనివాసరావు, పచ్చవ తిరుపతి స్వామి, చల్లా మనోజ్, తానికొండ ప్రతాప్, అల్లం సురేష్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# పొరపాట్లకు తావులేకుండా పదవ తరగతి పరీక్షల నిర్వహణ

- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు
- ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి అధికారులతో సమావేశం




**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 07**
పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి జిల్లాలోని పరిస్థితిపై సమీక్షించారు. ఈనెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు రెగ్యులర్ విభాగ పరీక్షలు, 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు డిఇఓ సి.వి. రేణుక ఈ సందర్భంగా వివరించారు. రెగ్యులర్ పబ్లిక్ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు, ఓపెన్ స్కూల్ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, కేటాయించిన కేంద్రాలు, తదితర వివరాలను కూడా డీఈవో వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, త్రాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు ఒక వారం ముందుగానే ఆయా కేంద్రాలను సందర్శించి వీటిపై దృష్టి సారించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం తగిన రవాణా సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్ లను మూసివేయిస్తామని, అవసరమైన బందోబస్తు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జగన్నాధరావు, ఏపీ సీపీడీసీఎల్ ఎస్.ఈ. వెంకటేశ్వర్లు, డిటిసి సుశీల, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఏపీఎస్ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్వైజర్ ఫణి కుమార్, పంచాయతీ, మున్సిపల్, పోస్టల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**పరీక్షల నిర్వహణ ఇలా...:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెగ్యులర్ పబ్లిక్ పరీక్షలకు మొత్తం 28,632 మంది విద్యార్థులు హాజరవుతారు. వీరిలో రెగ్యులర్ విభాగంలో 14,289 మంది బాలురు, 14,312 మంది బాలికలు ఉన్నారు. ప్రైవేట్ విభాగంలో 21 మంది బాలురు, పదిమంది బాలికలు ఉన్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ నుంచి రెగ్యులర్, ఒకసారి ఫెయిల్ అయిన వారు 1144 మంది ఉన్నారు. వీరిలో 823 మంది బాలురు, 321 మంది బాలికలు పరీక్షలు రాస్తారు. ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షల కోసం 165 సెంటర్లను, ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల కోసం 14 సెంటర్లను ప్రభుత్వం కేటాయించింది. పబ్లిక్ పరీక్షలు ముగిశాక ఒంగోలులోని డిఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ నాలుగవ తేదీ నుంచి 13వ తేదీ వరకు స్పాట్ వాల్యుయేషన్ ఉంటుంది.

# రూ.1.44 కోట్లతో పంగులూరులో వెలుగులు

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి గొట్టిపాటి



**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్) పెన్ పవర్, మార్చి 7**
జె. పంగులూరు మండలం, పంగులూరు గ్రామంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ ఆదేశాలతో రూ.1.44 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన విద్యుత్ ఆధునీకరణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. గతేడాది సెప్టెంబర్ 12న మంత్రి పంగులూరు పర్యటనకు వచ్చినప్పుడు, తరచుగా విద్యుత్ అంతరాయాలు కలుగుతున్నాయని, పాత స్తంభాలు, లైన్లతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి.. విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు వెంటనే ఆధునీకరణ పనులు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

**570 నూతన స్తంభాలు, 5 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు..:** విద్యుత్ శాఖ అధికారులు మంత్రి ఆదేశాలతో గ్రామంలోని పాత లైన్లు, స్తంభాలను పూర్తిగా తొలగించారు. వాటి స్థానంలో ఏకంగా 570 నూతన విద్యుత్ స్తంభాలను, 5 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు కొత్త విద్యుత్ లైన్లను నిర్మించారు. దీంతో పంగులూరులో ఇకపై విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా, నాణ్యంగా మారనుంది. పూర్తయిన ఈ పనులను విద్యుత్ శాఖ ఈ.ఈ నల్లూరి మస్తాన్ రావు, మండల అధ్యక్షుడు రావూరి. రమేష్ తదితరుల ఆధ్వర్యంలో శనివారం లాంఛనంగా ప్రారంభించారు. దశాబ్దాల విద్యుత్ కష్టాలను తీర్చిన మంత్రి గొట్టిపాటి. రవికుమార్‌కు గ్రామస్తులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చిలుకూరు. కోటయ్య, దేవస్థానం చైర్మన్ జాగర్లమూడి. బుచ్చయ్య, సర్పంచ్ గుడిపాటి. నాగేంద్రం, జె.కె.సి, మేడ. సుబ్బారావు, చిలుకూరి. వీరరాఘవయ్య, పొద. రామాంజనేయులు, కొల్లా. వెంకటేశ్వర్లు, చిలుకూరి. రామారావు, గ్రామ సెక్రటరీ శిరీష, విద్యుత్ శాఖ డీఈఈ ఎం.దామోదరం, ఏ.ఈ పి.ఆంజనేయులు, ఇతర నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష

- ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే కాన్పు సమయంలో రూ. 25 వేల ప్రోత్సాహం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 07**
ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో 116 మంది లబ్ధిదారులకు రూ. 90 లక్షల విలువైన సీఎం. ఆర్ ఎఫ్ చెక్కుల్ని మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1640 మందికి రూ. 12 కోట్ల 92 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశాం అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష. ఆరోగ్య అవసరాలకు పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని సీఎం. ఆర్. ఎఫ్ ద్వారా అండగా నిలుస్తున్నారు. పేదల ఆరోగ్యానికి ధీమాగా రూ. 25 లక్షలతో బీమా సౌకర్యం తీసుకొస్తున్నాం అని అన్నారు. సంజీవని పథకంతో రాష్ట్రంలోని ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్ ని డిజిటలైజేషన్ చేస్తాం అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో జనాభా తగ్గుదల, వృద్ధుల సంఖ్య పెరుగుదల నేపథ్యంలో పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే కాన్పు సమయంలో రూ. 25 వేల ప్రోత్సాహం అందించే విషయంపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 2023 నివేదిక ప్రకారం ఏపీలో ఏడాదికి 6.70లక్షల మంది పిల్లలు మాత్రమే పుడుతున్నారని, ఈ లెక్కన 2047 నాటికి ఏపీలో వృద్ధుల సంఖ్య ఏ స్థాయిలో పెరిగిపోతుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదన్నారు. అందుకే జనాభా వృద్ధిపై కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని

# హైదరి క్లబ్ లో రాష్ట్ర స్థాయి ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 07**
ఒంగోలు హైదరి క్లబ్ వేదికగా రెండు రోజులు పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలో తొలి రోజు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రకాశం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా టెన్నిస్ క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా ప్రదర్శన కనబరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 జట్లు టోర్నీ నందు పాల్గొనడం జరిగిందని నిర్వాహకులు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండవరపు రాఘవ తెలిపారు.ఓపెన్ కేటగిరి,వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి 8వ తేదీన జరిగే కార్యక్రమంలో బహుమతుల ప్రధానం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ రెడ్డి, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# మేదరమెట్లలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్.. 'ఆపరేషన్ వజ్రప్రహార్'

## గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం.. తనిఖీల్లో 40 మోటార్ సైకిళ్ల స్వాధీనం






**అద్దంకి(ఆర్సీ ఇంచార్జ్) పెన్ పవర్, మార్చి 7**

మాదకద్రవ్యాల నిర్మూలన, నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం 'ఆపరేషన్ వజ్రప్రహార్' చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం ఉదయం దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మేదరమెట్ల గాంధీనగర్‌లో పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. అద్దంకి టౌన్ సీ.ఐ సుబ్బరాజు, రూరల్ సీ.ఐ మల్లికార్జున రావు, 6 మంది ఎస్సైలు, 44 మంది పోలీసు సిబ్బంది డాగ్ స్క్వాడ్‌తో (పోలీస్ జాగిలం) కలిసి కాలనీని జల్లెడ పట్టారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు తదితర ప్రాంతాల్లో అణువణువూ సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 40 అనుమానాస్పద మోటార్‌సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**యువత మత్తు వీడితేనే ఉజ్వల భవిష్యత్తు**

"డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో పోలీసులు స్థానిక ప్రజలతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబ వ్యవస్థలు కూడా కుప్పకూలుతాయని డీఎస్పీ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. విద్య, క్రీడలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి సన్మార్గంలో నడవాలని ఆయన యువతకు దిశానిర్దేశం చేశారు. ర్యాలీలో పాల్గొన్న యువత, వ్యాపారులు, కాలనీ వాసుల చేత "గంజాయిని పారదోలుదాం -- డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడుదాం" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. పరిసర ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ విక్రయాలపై ఎవరికైనా సమాచారం తెలిస్తే తక్షణమే 'ఏపీ ఈగల్' టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు కాల్ చేయాలని, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆడపిల్లల్ని రక్షిద్దాం... ఆడపిల్లను చదివిద్దాం



**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 7**

జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా పుల్లల చెరువు మండలం ముటుకుల గ్రామంలో ఆడపిల్లల్ని రక్షిద్దాం... ఆడపిల్లను చదివిద్దాం అనే నినాదంతో అంగన్వాడి కార్యకర్త సుజాత ఆధ్వర్యంలో బాలికలతో అవగాహన సైకిల్ ర్యాలీ నిర్వహించారు.గ్రామంలోని అంగన్వాడి కేంద్రం వద్ద ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీలో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు.చేతుల్లో ప్లకార్డులు, నినాదాలతో గ్రామంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించి ఆడపిల్లల రక్షణ, విద్య ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.బేటీ బచావో -- బేటీ పడావో,ఆడపిల్ల భవిష్యత్తే దేశ భవిష్యత్తు, ఆడపిల్లను గౌరవిద్దాం -- సమాజాన్ని అభివృద్ధి చేద్దాం వంటి నినాదాలు ర్యాలీ అంతా మార్మోగాయి.ఈ సందర్భంగా ముటుకుల సెక్టార్ సూపర్వైజర్ దేవి బాయ్ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న వివక్షను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఆడపిల్లకు సమాన హక్కులు, మంచి విద్య అందేలా తల్లిదండ్రులు, సమాజం కలిసి కృషి చేయాలని సూచించారు.ఆడపిల్లలను రక్షించడం మాత్రమే కాకుండా వారికి మంచి విద్య అందించడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.మహిళల సాధికారతకు విద్య ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, ప్రతి కుటుంబం ఆడపిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.బాలికలు చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకుంటే కుటుంబం, గ్రామం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ముటుకుల సెక్రెటరీ కిరణ్,గ్రామ మహిళలు, బాలికలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### టెట్ నుండి ఉపాధ్యాయులను మినహాయించాలంటూ ఏపీటీఎఫ్ ధర్నా



**పెన్ పవర్, కంభం మార్చి 7**

టెట్ నోటిఫికేషన్ రాకముందు ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 10వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని మార్కాపురం జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాయబ్ రసూల్ కె. మల్లికార్జున కంభం మండల ఏపీటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్. భాస్కర్ నాయుడు,బి.రంగస్వామి పిలుపునిచ్చారు. 2009 విద్యా హక్కు చట్టం ఆధారంగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు సైతం టెట్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని లేని పక్షంలో ఉద్యోగాల నుండి తొలగించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన పరిస్థితి ఉందని ఈ తీర్పు రావటానికి మూలమైన విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని,అసంబద్ధ నిర్ణయాలను తిప్పికొటేందుకు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అత్యధికంగా పాల్గొని ఢిల్లీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# పాఠశాలకు క్రికెట్ కిట్ - కుర్చీలు అందజేత



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 7**

గిద్దలూరు మండలంలోని బురుజుపల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యారులకు గ్రామంలోని మాజీ సైనిక ఉద్యోగి వెంకట రంగయ్య పాఠశాలకు క్రికెట్ కిట్, 4 కుర్చీలు ప్రదానం చేశారు. అదే గ్రామానికి చెందిన అరిగెల వీర నారాయణ పాఠశాల అభివృద్ధికి తనవంతుగా రు 3000 రూపాయలు ప్రదానం చేశారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన ఈ .వెంకటేశ్వర్లు గ్రామ సర్పంచి శేషగిరి ఎస్ ఎమ్ ఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు వెంకటరంగయ్య, వీరనారాయణను ఉపాధ్యాయులు, ,గ్రామ పెద్దలు అభినందించారు.

# సి ఎస్ పురం జడ్పీహెచ్ఎస్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**సి.ఎస్.పురం, పెన్ పవర్ మార్చి 7**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం సమక్షంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం మహిళా ఉపాధ్యాయినులను పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు మహిళా సాధికారతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు విద్య, వైద్యం, విజ్ఞానం, రాజకీయాలు వంటి అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని ఆమె అన్నారు. భవిష్యత్ తరానికి గొప్ప మహిళా వనరులుగా విద్యార్థినీలు ఎదగాలని, అందుకోసం చిన్ననాటి నుంచే తమ ప్రతిభను అభివృద్ధి చేసుకుని స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.అలాగే క్రమశిక్షణ, కష్టపడి చదవడం, సమయపాలన వంటి లక్షణాలు అలవర్చుకుంటే విద్యార్థినీలు ఉన్నత స్థాయికి చేరుకోవడం సులభమవుతుందని తెలిపారు. మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మహిళా సాధికారతకు చదువే ప్రధాన ఆయుధమని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పాలేగార్ వారసత్వ పెన్షన్ మంజూరు చేయండి



**పుల్లలచెరువు పెన్ పవర్, మార్చి 7**

పాలేగార్ వ్యవస్థ రద్దు సమయంలో ప్రభుత్వం కల్పించిన వారసత్వ పెన్షన్ తనకు మంజూరు చేయాలని కొర్లకుంట జానకిరఘు మార్కాపురం జిల్లా పాలేకర్ పింఛన్ కోసం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ను కోరారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1801 సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వం పాలేగార్ వ్యవస్థను రద్దు చేసి, పాలేగార్ కుటుంబాల వద్ద ఉన్న భూములను స్వాధీనం చేసుకుని వారికి వారసత్వంగా పెన్షన్ (తబ్లీ) ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. ఆ నిర్ణయం ప్రకారం కొర్లకుంట కుటుంబానికి కూడా పెన్షన్ మంజూరు చేయబడిందన్నారు.ఈ క్రమంలో కొర్లకుంట సత్యనారాయణరావు పి.పి.ఓ. నెం.1246 ద్వారా నెలకు రూ.881 పెన్షన్ అందుకుంటూ 1995 ఆగస్టు 4 వరకు పొందారని వివరించారు. ఆయన మరణించిన అనంతరం ఆయన కుమారుడు వీర రాఘవరావు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అనంతరం ఆయన కూడా మరణించారని తెలిపారు.తదనంతరం వారి పెద్ద కుమారుడు అయిన కొర్లకుంట జానకిరఘు వారసత్వ హక్కు ప్రకారం తనకు పాలేగార్ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతున్నారు.ఈ విషయమై 2005 సంవత్సరం నుంచి సంబంధిత అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఇప్పటి వరకు సమస్యకు పరిష్కారం లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన దరఖాస్తు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉండగా అక్కడి నుంచి సీసీఎల్ఏకు పంపగా కొన్ని సూచనలు వచ్చాయని పేర్కొన్నారు. ఆ సూచనల మేరకు పుల్లలచెరువు తహశీల్దారు, మార్కాపురం ఆర్డీవో కార్యాలయాల నుంచి అవసరమైన వివరాలు సేకరించి మళ్లీ కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు.అయితే తన ఫైల్‌ను మార్కాపురం జిల్లా కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారని, దీనిపై త్వరితగతిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.బి.ఎస్.ఓ. 73 (6)(1) ప్రకారం జిల్లా కలెక్టర్ తగిన నిర్ణయం తీసుకుని తనకు వారసత్వ పాలేగార్ పెన్షన్ మంజూరు చేయాలని జానకిరఘు విజ్ఞప్తి చేశారు.

# స్ప్రింగ్‌బోర్డ్ స్కూల్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 7**

గిద్దలూరు లోని స్ప్రింగ్‌బోర్డ్ స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల కోసం పలు వినోదాత్మక ఆటలు , పోటీలు నిర్వహించగా, అందులో పాల్గొన్న మహిళలు ఎంతో ఆనందంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల్లో విజేతలైన మహిళలకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు పాఠశాల నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ డా.జె.వి.నారాయణ మాట్లాడుతూ, మహిళలు కుటుంబం , సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి కృషిని గౌరవించేందుకు మహిళా దినోత్సవాన్ని ప్రత్యేకంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మణి చైతన్య మాట్లాడుతూ, "మహిళలు కుటుంబానికి మాత్రమే కాదు సమాజ అభివృద్ధికి కూడా మూల స్తంభాలు. ప్రతి విజయవంతమైన కుటుంబం వెనుక ఒక మహిళ యొక్క త్యాగం, ప్రేమ, సహనం ఉంటాయి. మహిళలు విద్య, సేవా భావం , ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు మా పాఠశాలలో మహిళా తల్లిదండ్రుల భాగస్వామ్యం మాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాడి శ్వేత, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సర్వేలను త్వరగా పూర్తి చేయాలి-ఎంపీడీవో సుజాత





**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 7**

మండలంలోని పెద వెంకన్నపాలెం, విప్పగుంట గ్రామాలలో శనివారం ఎంపీడీవో డాక్టర్ పి సుజాత యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, సిటిజన్ ఈ కేవైసీ సర్వేలను పరిశీలించారు. అనంతరం సుజాత సిబ్బందితో మాట్లాడుతూ సర్వేలను త్వరగా పూర్తిచేయాలని, సచివాలయ సిబ్బంది ద్వారా లేదా ఆన్లైన్లో ఆధార్ ఓటిపి ద్వారా కుటుంబ వివరాలను ఈ కేవైసీ నీ అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను, సమాచారాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పెద వెంకన్నపాలెం గ్రామంలో అసంపూర్తిగా నిర్మించిన పంచాయితీ భవనాన్ని పరిశీలించి మిగిలిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రకళ నారాయణ, వీఆర్వో నాయుడు, నాయకులు తుమాటి చిన్నప నాయుడు, చల్ల సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అద్దంకిలో 100 పడకల ఆసుపత్రే లక్ష్యం..

### మహిళలు భాగస్వాములు కావాలి

### డాక్టర్ చింతలపూడి. అశోక్ కుమార్



**అద్దంకి(ఆర్సీ ఇంచార్జ్) పెన్ పవర్, మార్చి 7**

అమ్మగా, అక్కగా, చెల్లిగా, నాయకురాలిగా సమాజానికి వెలుగునిస్తున్న ప్రతి మహిళా మూర్తికి అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి. అశోక్ కుమార్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అద్దంకి ప్రాంత మహిళల ధైర్యం, సేవాభావం అందరికీ గర్వకారణమని శనివారం ఒక ప్రకటనలో కొనియాడారు. మహిళా దినోత్సవం నాడు కేవలం శుభాకాంక్షలు చెప్పుకోవడమే కాకుండా, మన ప్రాంత ఆరోగ్య భవిష్యత్తు కోసం మహిళలంతా ఒక అడుగు ముందుకు వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు.

**రాజకీయాలకు అతీతంగా ప్రజా ఉద్యమం**

అద్దంకిలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి సాధనే తమ ప్రధాన లక్ష్యమని, ఇది ఏ ఒక్కరి రాజకీయ పోరాటం కాదని అశోక్ కుమార్ స్పష్టం చేశారు. ఇది ప్రతి తల్లి భద్రత, గర్భిణీ స్త్రీల సురక్షిత ప్రసవం, పిల్లల ఆరోగ్యం కోసం చేస్తున్న ప్రజా ఉద్యమమని ఆయన ఉద్ఘాటించారు. ఏదైనా సాధించాలనే మహిళల దృఢ సంకల్పం తోడైతే ఈ ఆసుపత్రి కల కచ్చితంగా నిజమవుతుందని ఆయన ఆకాంక్షించారు. అద్దంకి ప్రజల ప్రాథమిక ఆరోగ్య హక్కు కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# కసినేపల్లిలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

*ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధ మహిళలకు సన్మానం.*

*మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ ప్రగతి పథంలో ముందుకు సాగాలి - డాక్టర్ బిజ్జం చిన్న నరసయ్య.*






**కొమరోలు పెన్ పవర్ మార్చి 7**

కొమరోలు మండలం కసినేపల్లి గ్రామంలో ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బిజ్జం చిన్న నరసయ్య, అంగన్వాడి టీచర్ దీవెనమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈనెల 8వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ అధ్యక్షులు చిన్న నరసయ్య అధ్యక్షత వహించగా, ఆ గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరుపెద్ది శ్రీధర్ శర్మ, సహోపాధ్యాయురాలు , అంగన్వాడి టీచర్ దీవెనమ్మ, ఏఎన్ఎం నవీన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా డాక్టర్ చిన్న నరసయ్య మాట్లాడుతూ , ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్థాపించిన వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. మహిళల హక్కులు,,సామాజిక ,ఆర్థిక, రాజకీయంగా మహిళలు అభివృద్ధి చెందవలసిన ఆవశ్యకతను వివరిస్తూ ఆయన ఉపన్యసించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ శర్మ మాట్లాడుతూ ,పూర్వం మహిళలను వంట ఇంటి కుందేలు అనే వారిని అయితే నేటి సమాజంలో మహిళలు పురుషులతో పాటుగా అన్ని రంగాలలో రాణిస్తూ ఉన్నత ఉద్యోగాలు, పదవులు పొందుతున్నారని తెలిపారు. ఈ పరిణామం ఎంతో గర్వకారణం అని అంటూ బాలికల పట్ల తల్లిదండ్రులు వివక్షత చూపగా వారిని కూడా బాలుర తో సమానంగా ఉన్నత చదువులు చదివించి వారి ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడాలని ఆయన తల్లిదండ్రులను కోరారు. అంగన్వాడీ టీచర్ దీవెనమ్మ మాట్లాడుతూ, బాల్య వివాహాలను సమూలంగా అరికట్టాలని ,బాల్య వివాహాలు చేసుకోవడం వలన బాలికలు ఎదుర్కొనే శారీరక మానసిక ఇబ్బందులపై తల్లిదండ్రులకు సంపూర్ణ అవగాహన కల్పించి వారి ఆలోచన విధానాన్ని మార్పు చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆయన తెలిపారు .బాలికలు కూడా బాల్య వివాహాల వైపు మొగ్గుచూపక,నిరక్షరాసులైన తల్లిదండ్రులకు తమ భవిష్యత్తుపై అవగాహన కల్పించి వారి ఆలోచన విధానంలో మార్పులు తీసుకుని రావాలని ఆమె కోరారు. ఏఎన్ఎం నవీన మాట్లాడుతూ సమాజం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నప్పటికీ ఇంకా గ్రామీణ ప్రాంతాలలో మూఢనమ్మకాలు ,అపోహలు, సాంఘిక దురాచారాలు తొలగిపోవకపోవడం విచారకరమని తెలిపారు. మూఢనమ్మకాలతోనే అనేకమంది తల్లిదండ్రులు తమ మైనర్ బాలికలకు వివాహాలు చేసి బరువు దించుకోవాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం చట్టాలు ఎన్ని చేసినా సమాజంలో ప్రజలలో మార్పు రానంతవరకు మూఢనమ్మకాలు సాంఘిక దురాచారాలు కొనసాగుతూ ఉంటాయని అని చెప్పారు. ఆ కార్యక్రమంలో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, కార్యక్రమంలో పాల్గొన్న ఏఎన్ఎం నవీన, అంగన్వాడి కార్యకర్త లక్ష్మీ నరసమ్మ, ఉపాధ్యాయురాలు తదితర మహిళలను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# కోడి పందాల స్థావరాలపై దాడి



**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 7**

మండలం లోని మాలపాడు వలెటివారిపాలెం సరిహద్దులో గల మాలపాడు గ్రామ సరిహద్దులలోనీ అటవీ ప్రాంతంలో కోడిపందాలు ఆడుతున్న వారిపై సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో కోడి పంధాలు ఆడుతున్న 23 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 3 కోడిపుంజులు 18 బైకులు 23 సెల్ ఫోన్లు మరియు 42,860/ డబ్బులు స్వాధీనపరచు కోవడం జరిగింది. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# 11వ రోజు ఇంటర్మీడియట్ పరీక్షకు 37 మంది గైర్హాజరు

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 7**

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా 11వరోజు శనివారంనాడు మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించబడింది.ఎకనమిక్స్ -1(న్యూ) ఎకనామిక్స్ -1(ఓల్డ్) తో పాటు ఒకేషనల్ వారికి బ్రిడ్జి కోర్సు - బయలాజికల్ సైన్సెస్ -1ఈ రోజు నిర్వహించబడ్డాయి.పరీక్ష కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు కె. సత్యరామిరెడ్డి,కస్టోడియన్ వి. పూర్ణ చంద్రుడు తనిఖీలు నిర్వహించారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు ఎం. మురళీకృష్ణ,ఎ.అల్లూరయ్య,ఆర్. శిరీష కుమారి హాజరు వివరాలను తెలిపారు. పట్టణములోని మూడు పరీక్ష కేంద్రాలకు 236 మంది హాజరవ్వాల్సి ఉండగా 199 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వారీగా వివరాలిలా ఉన్నాయి. శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 158 మందికి 142 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు. శ్రీ జీవనజ్యోతి జూనియర్ కళాశాలలో 36 మందికి 23 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు.సాహితి జూనియర్ కళాశాలలో 42 మందికి 34 మంది హాజరై, 8 మంది గైర్హాజరయ్యారు.

# మండలంలో భారీ కార్డెన్ అండ్ సెర్చ్

## - 33 వాహనాలు సీజ్





**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 7**

జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కందుకూరు ఎస్.డి.పి.ఓ. సిహెచ్. వి. బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో శనివారం నాడు పొన్నలూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో భారీ కార్డెన్ అండ్ సెర్చ్ (తనిఖీలు) నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అన్వర్ బాషా కొండేపి సి.ఐ జి. సోమశేఖర్, కందుకూరు సిఐ, కొండేపి పొన్నలూరు కందుకూరు టౌన్, రూరల్ ఉలవపాడు, లింగసముద్రం ఎస్సైలు తమ సిబ్బందితో కలిసి సుమారు 50 మంది పోలీసులతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ప్రజల భద్రతను కాపాడటం గంజాయి కోసం తనిఖీ, బెల్టు షాపులు నిర్వహణ అరికట్టడం, నేరాలను అదుపు చేయడమే లక్ష్యంగా ఈ తనిఖీలు జరిగాయనీ తెలిపారు.ఈ తనిఖీలలో కాలనీలోని ప్రతి ఇంటిని అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 33 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 33 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా కందుకూరు సబ్ డివిజన్లో పోలీస్ ఆఫీసర్ సిఐ జి. సోమశేఖర్ మాట్లాడుతూ ప్రజలు తమ వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను ఎల్లప్పుడూ కలిగి ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి విక్రయించడం సేవించేటు వంటి వ్యక్తుల గురించి సమాచారాన్ని కనుగొనడం, బెల్ట్ షాపుల నిర్వహణ అరికట్టడం, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన జిల్లా కలెక్టర్.. ఎస్పీ





క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి07

హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు శనివారం ఒంగోలు వచ్చారు. స్థానిక కోర్టు భవన సముదాయంలో జిల్లా ఇంచార్జ్ ప్రిన్సిపల్ జడ్జ్ టి.రాజ్యలక్ష్మి, కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, పలువురు అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

# బసిరెడ్డిపాలెం హైస్కూలులో ఘనంగా మహిళ దినోత్సవం

**సన్మానం అందుకున్న**

**మహిళ ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది**





**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 07:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా మహిళా దినోత్సవాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బసిరెడ్డిపాలెం నందు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాపులూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగినది. ఈ సందర్భంగా బసిరెడ్డిపాలెం ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను, వంట సిబ్బందిని ప్రధానోపాధ్యాయులు కాపులూరి వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మానం పొందిన వారిలో ఆయా గోవిందమ్మ, కుకింగ్ జయమ్మ, టీచర్స్ ఆర్.సులోచన, కె.కృష్ణవేణమ్మ, కె.సుమతి, ఎమ్.భువనేశ్వరిలు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కాపులూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ సాధనలను గుర్తించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం మహిళ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం అని, సమాజంలో స్త్రీలకు సముచిత గౌరవం, సమాన అవకాశాలు కల్పించాల్సిన ఆవశ్యకతను ఈ రోజు గుర్తు చేస్తుందని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుతారని, ప్రస్తుతం మార్చి 8న పాఠశాలకు సెలవు కావడంతో ఒకరోజు ముందుగా ముందస్తు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగిన దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దండి మార్చ్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

## -మార్చి 12వ తారీకున జరిగే దండి మార్చ్ కు ఆహ్వానం అందజేత



**కందుకూరు పెన్ పవర్, మార్చి 7**

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ను శనివారం టిడిపి పార్టీ కార్యాలయంలో వైబ్రేషన్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ సభ్యులు అత్తంటి కొండలరావు కలిశారు. మార్చి 12 వ తారీకున జరిగే దండి మార్చ్ కార్యక్రమానకి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. భారతరత్న అబ్దుల్ కలాం స్ఫూర్తి తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో మాదకద్రవ్యాల పట్ల ప్రజలలో చైతన్యం కలిగించేందుకు మహాత్మాగాంధీ ఉద్యమ స్ఫూర్తితో (ఉప్పుసత్యాగ్రహం ) దండి మార్చ్ 2.ఓ 100 మీటర్ల జాతీయపతాకం తో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాలికల పాఠశాల నించి ఎన్టీఆర్ విగ్రహం వరకు మార్చి 12వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం లో టిడిపి పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మొదటి వారి పాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, యువజన నాయకుడు బెజవాడ ప్రసాద్,జనిగర్ల నాగరాజు, షేక్ రఫీ, కృష్ణారెడ్డి, చదలవాడ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి పట్టణ ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# స్వదేశీ ఉత్పత్తుల వినియోగానికి ప్రజలు ముందుకు రావాలి

**బిజెపి రాష్ట్ర నేత డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి**

**పెద్ద దోర్నాల పెన్ పవర్ మార్చి 7**

ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని, అప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో రాష్ట్రంలో స్వదేశీ ఉద్యమం ప్రారంభమైందని అన్నారు. దేశంలో స్వదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని, అలాగే స్థానిక పరిశ్రమలకు ప్రోత్సాహం లభించడమే కాకుండా, యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఏలూరి పేర్కొన్నారు.. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రజలు స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఆ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధికి ప్రతి భారతీయుడు తనవంతు బాధ్యతగా స్వదేశీ వస్తువులను వినియోగించాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ద్వారా దేశం ఆర్థికంగా మరింత శక్తివంతంగా మారుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.



# ఏరియా వైద్యశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**కందుకూరు పెన్ పవర్, మార్చి 7**

కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ముందుగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడడంలో ముందుండాలని సూచించారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరెడ్డి, వైద్యులు రమా ప్రియ హరిచందన, ధర్మతేజ ప్రసాదు,శ్రీకాంత్ స్టాఫ్ రమణమ్మ సుజాత పద్మావతి అరుణ ఇతర నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆధునిక పరిశ్రమల ఏర్పాటుకు అడ్వాన్స్డ్ స్కిల్ డెవలప్‌మెంట్ మార్గం – జిల్లా కలెక్టర్





**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ మార్చి07**

ప్రకాశం జిల్లా యువతకు అధునాతన నైపుణ్యాలను అందించేందుకు జిల్లా స్థాయిలో అడ్వాన్స్డ్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌ను ప్రఖ్యాతి గాంచిన సెంచూరియన్ యూనివర్సిటీతో కలిసి ఏర్పాటు చేయడం, ఆ కేంద్రంలో అందించాల్సిన అడ్వాన్స్డ్ స్కిల్ కోర్సులపై శనివారం ప్రకాశం భవనంలో కలెక్టర్ పి.రాజాబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతినిధులు ఆశిష్ మోడీ ( స్కిల్ డెవలప్మెంట్ విభాగ అధిపతి ), డాక్టర్ డి.ఎన్. సత్యనారాయణ, గ్రామ్ తరంగ్ టెక్నాలజీస్ ఎం.డి. బాబూశంకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా యువతకు ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్డ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా అందించగల కోర్సులు, అవసరమైన మౌలిక వసతులు, శిక్షణా విధానాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులను రూపొందించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ అడ్వాన్స్డ్ స్కిల్ సెంటర్ ద్వారా మైనింగ్ , గ్రీన్ ఎనర్జీ, సోలార్, డ్రోన్స్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి సెక్టార్స్ లో యువతకు ఉన్నత స్థాయి శిక్షణ అందించి పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం ద్వారా జిల్లా యువతకు అధునాతన నైపుణ్య శిక్షణ అందించే దిశగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అడ్మిషన్స్

**జిల్లా ఎస్ ఎస్ ఏ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి**



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి07**

ప్రకాశం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్టీఈ 12(1)సి ప్రకారం అర్హులైన పేద విద్యార్థులు ఉచిత అడ్మిషన్లు కొరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్టీఈ 12(1) సి చట్టం ప్రకారం ప్రభుత్వం పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు ఉచితంగా ఒకటో తరగతిలో అడ్మిషన్ లకు అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. 2026–27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు వారి నివాస ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలకు ఆన్లైన్లో నిబంధన మేరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల మార్చి 10వ తేదీ లోగా గ్రామ సచివాలయం లేదా మండల విద్యా వనరుల కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే వెబ్సైట్ లో విద్యార్థుల ఆధార్ , ప్రాథమిక వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉచిత ప్రవేశాలకు సంబంధించిన వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18004258599 ను సంప్రదించాలని సూచించారు. మార్చి 25న మొదటి విడత లాటరీ విధానంలో ప్రభుతం సీట్లు కేటాయిస్తుందని స్పష్టం చేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన లూనా జబిన్

**పామూరు, పెన్ పవర్, మార్చి7**



1908లో న్యూయార్కులో తక్కువ పని గంటలు, మెరుగైన జీతం, ఓటు హక్కు డిమాండ్లతో 15 వేల మంది మహిళలు మొదటగా కార్మిక ఉద్యమం నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని అంతర్జాతీయంగా నిర్వహించాలనే ప్రతిపాదన మొదట చేసింది క్లారా జెట్కిన్ అనే మహిళ. 1910 లో జరిగిన అంతర్జాతీయ మహిళల సదస్సు దీన్ని ఆమోదించిందని లూనా జబిన్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు లూనా జబిన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1917 మార్చి 8 న పీటర్స్ బర్గ్ లో జరిపిన మొదటి మహిళ దినోత్సవం నాటినుండి మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచమంతటా జరుపుకుంటున్నారని ఆమె అన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజక, సాంస్కృతిక తదితర అన్ని రంగాలలో స్త్రీల సమాన భాగస్వామ్యంతో సంపూర్ణ మహిళా సాధికారిత సాధనకు పురుషులుకూడా పాటుపడాలని కోరుచూ, ఈ మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆమె కోరారు.

# పేదల వైద్యానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా

### -సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే ఇంటూరి -53 మందికి 31.73 లక్షలు పంపిణీ







**కందుకూరు పెన్ పవర్, మార్చి 7:**

ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే చంద్రబాబు ఆకాంక్ష అని, అందుకే పేదల వైద్యానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. మొత్తం 53 మంది 31.73 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తూ.. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తుంటే, వైసీపీ నేతలు పనికిమాలిన విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిపరులు, దొంగలను పక్కన ఉంచుకున్నారు కాబట్టే, గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారని, ఆ పార్టీ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి ఇటీవల ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసినా ఇంకా బుద్ధి రాలేదని, ఇప్పటికీ రప్పా రప్పా అంటూ వెర్రి వేషాలు వేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. గత ఎన్నికల్లో దారుణ ఓటమిపట్ల జగన్మోహన్ రెడ్డి పశ్చాత్తాపం ప్రకటించి, తప్పులు సరిదిద్దుకోవాల్సింది పోయి, రోజురోజుకూ మరింత దిగజారిపోతున్నారని నాగేశ్వరరావు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ఎక్కువగా నిధులు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. అనారోగ్య ఖర్చులు, పేదవారికి ఆర్థికంగా భారం కాకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి చెక్కులు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం ద్వారా సహాయం అందుకున్న ప్రతి ఒక్కరూ, కూటమి ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గుడ్లూరు మండలానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు 9.38 లక్షల రూపాయలు, కందుకూరు మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు 5.29 లక్షల రూపాయలు, కందుకూరు పట్టణానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు 5.57 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఉలవపాడు మండలానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు 6.87 లక్షల రూపాయలు, వలేటివారిపాలెం మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు 4.60 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, కందుకూరు రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గురువుకు శిష్యుడి ఘన సన్మానం

### విశ్రాంత ఉపాధ్యాయురాలు మరియమ్మకు మర్యాదపూర్వక గౌరవం





**సి ఎస్ పురం,పెన్ పవర్ మార్చి 7**

మండలంలోని కొండబోయినపల్లి గ్రామంలో విశ్రాంత అయ్యర్ గ్రేడ్ టీచర్ తాతపూడి మరియమ్మ (95)కు ఆమె శిష్యుడు ఘనంగా సన్మానం చేసిన సంఘటన గ్రామస్తులను ఆకట్టుకుంది. శనివారం బోడవులదిన్నె గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పందిటి వెంకటయ్య కుమారుడు, రిటైర్డ్ సైంటిస్ట్ పందిటి వెంకట తిరుపతి తన స్వగ్రామానికి వచ్చి మర్యాదపూర్వకంగా మరియమ్మను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పండ్లు, పూలు, స్వీట్లు అందజేసి గులాబీ దండతో మరియమ్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ హెడ్మాస్టర్ జొన్నలగడ్డ గోవిందయ్య, పందిటి వెంగళరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి విద్యాబోధన చేసి అక్షరాభ్యాసం నేర్పిన గురువును ఎన్నో సంవత్సరాల తరువాత గుర్తు పెట్టుకుని శిష్యుడు సన్మానించడం అరుదైన విషయం అని అన్నారు. ప్రపంచంలో ఎవరికీ లేని గౌరవం ఉపాధ్యాయ వృత్తికి ఉందని, గురువు స్థానం ఎంతో గొప్పదని ఈ సంఘటన నిదర్శనమని పేర్కొన్నారు. బెంగళూరులో స్థిరపడిన పందిటి వెంకట తిరుపతి తన స్వగ్రామాన్ని మర్చిపోకుండా గ్రామానికి వచ్చి పెద్దలను పలకరించి వారి ఆరోగ్య విషయాలు తెలుసుకోవడం అభినందనీయమని గ్రామస్థులు తెలిపారు. సన్మాన గ్రహీత తాతపూడి మరియమ్మ మాట్లాడుతూ చిన్నప్పుడు తన వద్ద చదువుకున్న శిష్యుడు ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా గురువును గుర్తుచేసుకొని గౌరవించడం ఆనందంగా ఉందన్నారు పెద్దలపట్ల గౌరవం గురువుల పట్ల కృతజ్ఞత చూపడం సమాజానికి ఆదర్శమని నేటి యువత ఆయనలో ఉన్న మంచి గుణాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బంధుమిత్రులు పాల్గొని గురు శిష్య సంబంధం గొప్పతనాన్ని కొనియాడారు.

## నాలుగేళ్ల కష్టాల కథకు ముగింపు...


# గిద్దలూరుకు తిరిగి చేరిన మంగమ్మ

### తప్పిపోయిమహారాష్ట్రలో “దేవక్క”... గిద్దలూరులో “మంగమ్మ”గా గుర్తింపు

### సీఎం చంద్రబాబు చొరవతో కుటుంబానికి చేరిన మహిళ –సినిమా కథను తలపించిన ఘటన

### గిద్దలూరు తహశీల్దార్ ఆంజనేయ రెడ్డి కృషి ప్రశంశనీయమ

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 7**



గిద్దలూరు పట్టణం చెందిన గొర్ల మంగమ్మ అనే మహిళకు నంద్యాల జిల్లా గోవిందపల్లికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. అయితే కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఆమె ఇంటి నుంచి తప్పి పోయి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు ఎంతోకాలం వెతికినా ఎలాంటి సమాచారం దొరకక చివరకు ఆశలు వదిలేశారు. ఇక 2022 ఫిబ్రవరిలో మహారాష్ట్ర రాష్ట్రంలోని చందాపూర్ జిల్లాలో ఆమెను అక్కడి పోలీసులు గుర్తించారు. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు నాగపూర్ మానసిక వైద్యశాలలో చేర్పించారు. ఆమెకు వినికిడి లోపం ఉండటం, తన వివరాలు చెప్పలేకపోవడం వల్ల ఆమె అసలు పేరు గుర్తించలేకపోయారు. దీంతో వైద్యశాలలో చేర్పించిన సమయంలో వైద్యులు ఆమెకు “దేవక్క” అనే పేరు నామకరణం చేశారు అప్పటి నుంచి అక్కడి వైద్యులు, సిబ్బంది అందరూ ఆమెను దేవక్కగా పిలుస్తూ సంరక్షణలో చికిత్స అందించారు. దాదాపు నాలుగు సంవత్సరాల పాటు చికిత్స అందుకున్న తర్వాత ఆమె ఆరోగ్యం కొద్దికొద్దిగా మెరుగుపడింది. ఈ సమయంలో ఆమె మాతృభాష అయిన తెలుగులో మాట్లాడటం ప్రారంభించడంతో నాగపూర్ వైద్యులు ఆమె స్వస్థలం గురించి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో విషయం ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరింది. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇటీవల జిల్లా పర్యటనలో ఈ ఘటనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆమె అసలు స్వస్థలం గుర్తించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై స్పందించిన అధికారులు రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లకు సమాచారం పంపించారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజా బాబు ఆదేశాలతో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి జిల్లాలోని అన్ని మండల కార్యాలయాలకు మహిళ వివరాలను పంపించారు. ఈ నేపథ్యంలో గిద్దలూరు తహసీల్దార్ ఆంజనేయ రెడ్డి, మండలంలో విచారణ జరపగా ఆమె సోదరుడిని గుర్తించి ఆయన సహకారంతో మహారాష్ట్రలో “దేవక్క”గా పిలవబడుతున్న ఆ మహిళ అసలు పేరు గొర్ల మంగమ్మ అని గుర్తించారు. అనంతరం స్త్రీ––శిశు సంక్షేమ శాఖ అధికారులు నాగపూర్ వెళ్లి ఆమెను సురక్షితంగా గిద్దలూరుకు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత మంగమ్మను చూసిన కుటుంబ సభ్యులు ఆనందభాష్పాలతో భావోద్వేగానికి గురయ్యారు. తమ కుటుంబ సభ్యురాలు తిరిగి రావడానికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తహసీల్దార్ ఆంజనేయ రెడ్డి, సంబంధిత అధికారులకు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## స్టార్ హెల్త్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం





**కందుకూరు పెన్ పవర్, మార్చి 7:**

ప్రణవి హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం కు విశేష స్పందన లభించింది. ప్రముఖ నేత్ర వైద్యురాలు డాక్టర్ నల్లూరి ప్రశాంతి స్వయంగా పాల్గొని వందలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ డివిజనల్ మేనేజర్ రాజేష్ ప్రత్యేకంగా పాల్గొని, ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కేవలం వేడుకలే కాదు.. సామాజిక బాధ్యతతో ప్రణవి హాస్పిటల్ స్టార్ హెల్త్ బృందం చేపట్టిన ఈ సేవపై కందుకూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బొత్సను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 7**

శాసన మండలి ప్రతిపక్ష నేత ,మాజీ మంత్రివర్యులు బొత్స సత్యనారాయణ ఇటీవల అస్వస్థత కు గురై హైదరాబాద్ లో చికిత్స చేయుంచుకొని విజయవాడకు చేరుకున్నారు విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు బొత్స నివాస గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రివర్యులు అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా వేములపాడులో 2కే రన్

**సి.ఎస్.పురం,పెన్ పవర్ మార్చి 7**

మండలంలోని వేములపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 2 కిలోమీటర్ల రన్ నిర్వహించనున్నట్లు మండల బిజెపి అధ్యక్షుడు గుంటకాల నరేష్, బిజెపి నాయకులు త్రిమూర్తులు, నరసింహులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రాజకీయాలకతీతంగా సుమారు 150 మంది మహిళామణులతో ప్రారంభించనున్నట్లు తెలిపారు మహిళల ఆరోగ్యం, ఐక్యత మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలం లోని లోని మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# మహిళ చదువు.. సమాజ అభివృద్ధికి దిక్సూచి

## సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ - ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ మార్చి07**

మహిళలకు ఉచితం గా న్యాయ సహాయం అందిస్తున్నా ఇంకా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, కేవలం నిరక్ష్యరాస్యత వలనే ఇలా జరుగుతుంది అని ప్రతి ఆడపిల్ల చదివితే తప్పనిసరి గా సామాజికంగా ఎదుగుదల ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. ప్రకాశం జిల్లా ఎన్జీవో మహిళ విభాగం ఆధ్వర్యంలో శనివారం 2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవలు ఘనంగా స్థానిక ఎన్జీవోహంలో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభ కు జిల్లా అధ్యక్షురాలు కుంచాల కోటేశ్వరమ్మ అధ్యక్షత వహించగా జిల్లా కన్వీనర్ సి హెచ్ శిరీష ఆహ్వానం పలికారు. పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.ఆర్. రాధిక మాట్లాడుతూ మహిళ కు ప్రత్యేకంగా మహిళ దినోత్సవ వేడుకలు జరపాల్సిన పని లేదన్నారు. ప్రతి రోజు మహిళ రోజే అని, మహిళ కు మహిళ శత్రువు అనడం తప్పు అని అటువంటి పరిస్తుతులు కల్పించారని అన్నారు. మహిళ తోటి మహిళలతో ఈర్ష్యా భావం తో కాకుండా సొదరీమణి భావంతో మెలగాలని సూచించారు. మహిళ మోడ్రన్ గా ఉండటం అంటే డ్రెస్ లు వేసుకోవడం నగలు ధరించడం మాత్రమే కాదు ఇప్పటి రోజుల్లో జరిగే నేరాల విధానాలు తెలుసుకొని ఇబ్బందుల్లో పడకుండా ఉండటం అవసరం అన్నారు. ముందు మనం తేలిగ్గా అందరినీ నమ్మడం ఆపాలని మహిళ తన స్వార్థం కూడా చూసుకోవాలని, సంబంధాలన్నీ డబ్బు సంబంధాలని, ఉద్యోగం రిటైర్డ్ అయిన తరువాత ఆర్థికంగా బలంగా ఉండటం అవసరం అని అటువంటి ప్రణాళిక మహిళా ఉద్యోగులు అలవర్చుకోవలన్నారు. ముఖ్యంగా సమర్థ వంతమైన ఆహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపడుకోవలని, నగలు డ్రెస్ ల కంటే ఆరోగ్యం కాపాడుకోవడం మహిళలకు అవసరం అని అన్నారు. అలాగే ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందించారు. జిల్లా విద్యా శాఖ అధికారి సి వి రేణుక మాట్లాడుతూ మహిళ మానసికంగా చాలా శక్తవంతమైనదని తను ఒకేసారి ఎన్నో పనులు ఒక్క సారి చేయగల సామర్థ్యం ఉందని, మనం చిన్నప్పటి నుండి మగ పిల్లలకు ఆడ పిల్లలను గౌరవించడం నేర్పించాలని అన్నారు. యన్ జి జి ఓ అసోసియేషన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కె శరత్ బాబు మాట్లాడుతూ మహిళా మహిళలు ప్రశ్నించే ధోరణినీ అలవాటు చేసుకోవాలి అని అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయి అని, మహిళలు సమస్య నాది కాదు అనుకోవడం వలనే మహిళ వెనుక బడిబోతున్నరని, మహిళ శారీరకంగా దృఢంగా ఉండి తనకోసం నిలబడితే సమస్యలు వాటి అంతట అవే పరిష్కారం అవుతాయని అన్నారు. యన్ జి జి ఓ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్ సి హెచ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ మహిళా ఉద్యోగినుల కు చైల్డ్ కేర్ లీవ్ 180 రోజులు వాడుకొనే పరిమితి ఎత్తి వేయించిన ఘనత ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ దే అన్నారు. ఉద్యోగినుల కు 5 రోజు లు అదనపు క్యాజువల్ లీవ్ మంజూరు చేయించింది, భవిష్యత్ లో కూడా మహిళా ఉద్యోగినుల సమస్యలు పరిష్కరించేందుకు ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ నేతృత్వంలో ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు గా విచ్చేసిన ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ పి మాధవి మాట్లాడుతూ నేడు అంతర్జాతీయ థీమ్ అయిన గివ్ టు గైన్ మన యన్ జి జి ఓ అసోసియేషన్ ద్వారా సాధ్యం అని అన్నారు. విశిష్ట అతిథి ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ జిల్లా మాజీ కోశాధికారి పి రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ మహిళా సాధికారిత ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ ద్వారానే సాధ్యం అని తను నాయకత్వ ఓనమాలు నేర్చుకొన్న ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ నేడు ఇంత అభివృద్ధి చెందటం ఆనందంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎపి యన్ జి జి ఓ అసోసియేషన్ జిల్లా కోశాధికారి కె శివ కుమార్, ఒంగోలు పట్టణ మహిళా విభాగం చైర్ పర్సన్ యస్ జ్యోతి, కన్వీనర్ సుప్రియ, ఒంగోలు పట్టణ యన్ జి ఓ అసోసియేషన్ అధ్యక్షులు కొత్తపల్లి మంజేస్, కార్యదర్శి షేక్ మగ్దుమ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్వాన కమిటీ కో-కన్వీనర్ గా వడ్లమానినారాయణచారి

**సి.ఎస్.పురం, పెన్ పవర్ మార్చి 7**



మండల కేంద్రంలోని సి.ఎస్.పురం గ్రామానికి చెందిన ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు వడ్లమాని నారాయణచారిని మార్కాపురం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆహ్వాన కమిటీ జిల్లా కో-కన్వీనర్ గా నియమించడం జరిగింది. ఆయన నియామకంపై ప్రాంతీయ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్లమాని నారాయణచారి మాట్లాడుతూ జిల్లాలో విశ్వబ్రాహ్మణ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా స్థాయి నాయకులు కలిసి నూతన కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపాటి శ్రీనివాసచారికి వినతి పత్రం సమర్పించినట్లు చెప్పారు. మార్కాపురం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆహ్వానం మేరకు చెన్నుపల్లి శ్రీనివాసాచారి జిల్లా స్థాయి నూతన కమిటీ ఏర్పాటుకు ఆహ్వాన కమిటీని నియమించారని, ఆహ్వాన కమిటీ కన్వీనర్ గా చెరుకుపల్లి సుబ్రహ్మణ్యచారిని నియమించారని తెలిపారు. అదేవిధంగా కో-కన్వీనర్లుగా వడ్లమాని నారాయణచారి తో పాటు కందుకూరి శివమణి, డి విశ్వనాథచారి, రాచర్ల శేఖర్, జుమ్మోజు వెంకటేశ్వర్లు, షరాబ్ దత్తచారి లను నియమించడం జరిగిందన్నారు. ఆహ్వాన కమిటీ సమన్వయంతో జిల్లాలోని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులను ఒక వేదికపైకి తీసుకువచ్చి సమావేశం నిర్వహించి, 30 రోజులలోపే నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు విశ్వబ్రాహ్మణ సంఘం ఐక్యతతో ముందుకు సాగేందుకు నాయకులను సభ్యులను కలుపుకొని పనిచేస్తానని అన్నారు సంఘం అభివృద్ధి సభ్యుల సంక్షేమం సామాజిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు కృషి చేస్తానని వడ్లమని నారాయణచారి ఓ ప్రకటనలో తెలిపారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 7**

రాచర్ల మండలం, మేడంవారి పల్లి గ్రామానికి చెందిన చిన్న పుల్లయ్య(55) అనే రైతు తన మొక్కజొన్న పొలంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఈ నెల12వ తేదీ నుంచి కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణలి

## కేజీబీవీ ప్రిన్సిపాల్స్ కటకం సజన

**పామూరు, పెన్ పవర్, మార్చి 7**



2026-27 విద్యాసంవత్సరంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరతగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు క్లాసుకు 40 సీట్ల వంతున, అదేవిధంగా 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 12వ తేదీ నుంచి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పామూరు కేజీబీవీ ప్రిన్సిపాల్స్ కటకం సజన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా ఏప్రిల్ 13వ తేదీన విడుదల చేసి 13 నుంచి 17 తేదీ వరకు ధ్రువపత్రాలు పరిశీలిస్తామని కటకం సజన తెలిపారు.

# సింహ వాహనంపై వెలుగొండ వెంకటేశ్వర స్వామి

**కొనకనమిట్ల పెన్ పవర్ మార్చి 7**

కొనకనమిట్ల మండలం గార్లదిన్నె పంచాయతీ పరిధిలోని వెలుగొండలో వెలసిన శ్రీ వెలుగొండ వెంకటేశ్వర స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చి ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచారు. ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా సింహ వాహన సేవను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారిని సింహ వాహనంపై ఆలయ పరిసరాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లగా భక్తులు "గోవిందా గోవిందా" నినాదాలతో భక్తి పరవశంలో మునిగిపోయారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వడం విశేషంగా నిలిచింది. పూజారులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామ ప్రజలు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ చెన్నకేశవ రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ కుందూరు కాశీరెడ్డి, భాషాపతి నాయుడు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఒంగోలు టౌన్ లో కార్డెన్.. సర్చ్ నిర్వహించిన పోలీసులు

## - డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో అవగాహన ర్యాలీ

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి07**



ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ రాయపాటి .శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, టు టౌన్ సీఐ శ్రీనివాసరావు,9 మంది సబ్ డివిజన్ ఎస్సైలతో 50 మంది సిబ్బంది కలిసి శనివారం ఉదయంఒంగోలు టౌన్ లోని వంటవారి కాలనీ, ఏకలవ్య కాలనీలో వజ్ర ప్రహర్ ఆపరేషన్ (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు.

తనిఖీలు ముఖ్యంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు, ఇతర ప్రదేశాలను తనిఖీలు నిర్వహించారు.సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 25 మోటార్‌సైకిళ్ల లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తదనంతరం డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. యువత, వ్యాపారులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గంజాయిని పారదోలుదాం -- డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడుదాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. అలాగే మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు,శిక్షలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తు కోసం విద్య, క్రీడలు, ఉపాధి వంటి రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అలాగే గంజాయి వంటి మాదకద్రవ్యాల విక్రయం, రవాణా లేదా నిల్వపై ఎవరైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టే దిశగా ఆపరేషన్ వజ్రప్రహార్ కింద ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

# ఉత్కంఠభరితంగా సాగిన ఎడ్ల బండ లాగుడు పోటీలు

## 3600 అడుగుల దూరంబండను లాగి సత్తా చాటిన కడపజిల్లా వృషభ రాజాలు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 7**

గిద్దలూరు మండలం నరవ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి నర్సిహస్వామి బ్రహోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఎడ్లబలప్రదర్శన శనివారం నాడు ఉత్కంఠభరితంగా సాగాయి. కాల్లూరు గ్రామం కడప జిల్లాపేరుమాల్ శివకృష్ణ యాదవ్ వృషభ రాజాలు 3600 అడుగుల దూరం బండనులాగి ప్రథమ స్థానం లో నిలిచి లక్ష రూపాయల నగదు బహుమతి కైవసం చేసుకున్నాయి. ద్వితీయ స్థానంలో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల కుచెందిన బొరెడ్డి కేశవరెడ్డి వృషభ రాజములు 3388 .03 దూరం బండనులాగి 80 వేల రూపాయల నగదును కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవ కు చెందిన వీరస్వామి చౌదరి వృషభ రాజములు 3041.09 అడుగులదూరం బండనులాగి తృతీయ స్థానం లో నిలిచి 60 వేల రూపాయలు ,ప్రకాశం జిల్లా జేసీ అగ్రహారం హుస్సేనాపురం రామసుబ్బారెడ్డి ,లక్కు నాగశివ శంకర్ ఎడ్లజత 3000 అడుగులదూరం బండను లాగిచతుర్ద స్థానంలో నిలిచి 40 వేలు అనంతరం ప్రకాశం జిల్లా బొడుచెర్ల నక్షత్ర రెడ్డి ఎడ్లు 2739. 05 అడుగులు దూరం , విజయవాడకు చెందిన కాసన్నేని రాజా చౌదరి , గన్నవారంకు చెందింస్ మోహన్ రావు ఎడ్లు 2523 .04 అడుగులదూరం బండనులాగి వరుసగా 20 వేలు, 10 వేలు నగదు బహుమతులు పొందారు, పోటీలో పాల్గొన్న ఎడ్లజత లకు 5000 వేళారూపాయలు నగదు బహుమతులు అందజేశారు. ఈ ఎడ్ల బలప్రదర్శన లో సి నారాయణ స్వామి, వెంటారామిరెడ్డి లు వ్యాఖ్యాతలు గా వ్యవహారించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. గత మూడు రోజులుగా జరిగిన ఎడ్ల బలప్రదర్శన నేటితో ముగిశాయి. బహుమతులను కొమరోలు మండలం బసువుపల్లె కు చెందిన ఏ1 కాంట్రాక్టర్ అంబటి భూపాల్ రెడ్డి బహుకరించారు.

# ఏపీ జెఏసి అమరావతి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ మార్చి07**



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపి జేఏసీ అమరావతి, ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపి జేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా తరపున మొదటి మహిళా మార్గదర్శి అవార్డును గంగాధ సుజాతకి అందజేశారు. మహిళల అభివృద్ధి, సామాజిక సేవలో ఆమె చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేసినట్లు నాయకులు తెలిపారు. ఇప్పటి నుండి ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'మహిళా మార్గదర్శి అవార్డు'ను ప్రదానం చేయడం జరుగుతుందని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా చైర్మన్ పి. మధుసూదనరావు, నాయకులు బి. సాయి శ్రీనివాసరావు, పోలయ్య, బాల సుబ్రహ్మణ్యం, మహిళా విభాగం కార్యదర్శి శ్రీదేవి, సభ్యులు లావణ్య, హసీన పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా నిర్వహించిన మహిళల క్రీడా పోటీలలో విజేతలైన మహిళా ఉద్యోగులకు ఈ సందర్భంగా మోమెంటోలు అందజేసి సన్మానించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళల సాధికారతకు, వారి ప్రతిభను వెలికితీయడానికి కార్యక్రమం దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన అందరికీ ఏపీ జేఏసీ అమరావతి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# హాస్టల్లో ఉంటున్న టెన్త్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## కొమరోలు లోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్ ను సందర్శించి తనిఖీ చేసిన సహాయ సంక్షేమ అధికారి హరి ప్రసాద్.

## టెన్త్ విద్యార్థినీల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు సలహాలు ఇచ్చిన హరి ప్రసాద్.



**కొమరోలు పెన్ పవర్ మార్చి 7**



కొమరోలు లోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్ ను శనివారం గిద్దలూరు వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి డి హరి ప్రసాద్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న భోజనం ,వసతి సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థినీల పట్ల తీసుకోవలసిన ప్రత్యేక చర్యల గురించి హాస్టల్ వార్డెన్ రోజాకు సిబ్బందికి వివరించారు. పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే సమయంలో వార్డెన్ లేదా సిబ్బంది విద్యార్థుల వెంట పరీక్షా కేంద్రం వరకు వెళ్లి వారిని పరీక్ష కేంద్రం వద్ద వదిలి రావాలని ,అలాగే పరీక్ష ముగిసిన వెంటనే పరీక్ష కేంద్రం వద్దకు వెళ్లి విద్యార్థులను హాస్టల్ కు వెంట ఉండి పిలుచుకొని రావాలని ఆయన సూచించారు. విద్యార్థులు కూడా పబ్లిక్ పరీక్షలు అంటే ఎలాంటి భయాందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ,పరీక్ష రాసే ముందు రోజు రాత్రి ఎలాంటి మానసిక ఒత్తిడిలు లేకుండా, విశ్రాంతి తీసుకుంటూ ప్రశాంతంగా నిద్రించాలని, ఉదయం కూడా పలహారం తీసుకొని ప్రశాంతంగా పరీక్ష కేంద్రానికి చేరుకొని ప్రశాంత వాతావరణంలో సంతృప్తికరంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తర్వులు కావాలని ఆయన కోరారు. ప్రతి విద్యార్థి 600కు 500 పైగా మార్కులు తెచ్చుకునే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం హరిప్రసాద్ బాలికలతో కలిసి ప్రార్థన చేసి భోజనం చేశారు. ఆ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రోజా, సిబ్బంది పాల్గొన్నారు.

# 210 సర్వే నెంబరు భూములను పరిశీలించిన కనిగిరి ఆర్డిఓ.

**పామూరు, పెన్ పవర్, మార్చి7**

మండలంలోని వగ్గంపల్లి పంచాయతీలో 210 సర్వే నెంబరు లో భూములను మైనింగ్ ఏడి, అగ్రికల్చరల్ ఏడి, ఫారెస్ట్ అధికారులతో కలసి కనిగిరి ఆర్డివో శివరామిరెడ్డి స్థానిక తహసిల్దార్ రామచంద్రుని వాసుదేవరావు తో కలిసి శనివారం పరిశీలించారు. ఇండోర్ సోల్ ప్రైవేట్ కంపెనీ మైనింగ్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకొనియున్నారు. నాలుగు శాఖల కు సంబంధించిన అధికారులు భూమి పరిశీలనలో పాల్గొన్నారు. స్థానిక తహసిల్దార్ రామచంద్రుని వాసుదేవరావు భూమికి సంబంధించిన వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పై అధికారుల ఆదేశాలతో భూమిని పరిశీలించామని నివేదికను పై అధికారులకు అందజేస్తామన్నారు.

## జమ్మిదోర్నాల సర్పంచి తండ్రిని పరామర్శించిన ఎమ్మెల్యే చంద్రశేఖర్‌లి



**పెద్ద దోర్నాల పెన్ పవర్ మార్చి 7**

మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ లో శనివారం పెద్ద దోర్నాల మండలం జమ్మి దోర్నాల సర్పంచ్ కొంగరి వెంకటరామయ్య నాన్న గారి కాలికి ఇన్ఫెక్షన్ అయ్యి ట్రీట్మెంట్ తీసుకుంటున్న వారిని పరామర్శించి, యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ధైర్యం చెప్పిన. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ పార్టీ మండల కన్వీనర్ గంటా వెంకటరమణారెడ్డి జమ్మిదోనాల సర్పంచి కొంగరి వెంకటరామయ్య ఎర్రగొండపాలెం మాజీ కన్వీనర్ ఓబుల్ రెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయుల మధ్య డాక్టర్ రాజ్ విమల్ జన్మదిన వేడుకలు



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు మార్చి07**

తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుర్రాల రాజ్ విమల్ జన్మదిన వేడుకలు శనివారం ఆయన మిత్రబృందం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్రులు ఏర్పాటుచేసిన పుట్టినరోజు కేకును రాజ్ విమల్ కట్ చేసి మిత్రులకు తినిపించారు. ఆత్మీయ మిత్రుని జన్మదిన సందర్భంగా దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

## మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

### - జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి07**



మార్చి 8వ తేదీన జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు మహిళా పోలీస్ సిబ్బందికి, జిల్లా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల పట్ల గౌరవం, సమానత్వం, సాధికారతను పెంపొందించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలు స్వశక్తిపై ఆధారపడి సమాజంలో గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. స్త్రీలు తమలోని సహజమైన సృజనాత్మకతను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాలలోనూ రాణించాలని సూచించారు. అలాగే మహిళలు ఉత్తమ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్. యం. స్వర్ణలక్ష్మి సృష్టి హాస్పెటల్.

**పామూరు, పెన్ పవర్, మార్చి 7**



మార్చి 8వ తేదీన జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సృష్టి హాస్పిటల్ ప్రసూతి మరియు స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్. యం. స్వర్ణలక్ష్మి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల పట్ల గౌరవం, సమానత్వం మరియు సాధికారతను పెంపొందించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని ఆమె అన్నారు. మహిళలు స్వశక్తిపై ఆధారపడి సమాజంలో గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించుకోవాలని ఆమె ఆకాంక్షించారు. స్త్రీలు తమలోని సహజమైన సృజనాత్మకతను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాలలోనూ రాణించాలని డాక్టర్. యం. స్వర్ణలక్ష్మి అన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి07**

విద్యుత్ లైన్ వర్క్ జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 10-00 గంటల నుండి మధ్యాహ్నం 01-00 గంటల వరకు 11కెవి రాజా పానకాల రోడ్డు ఫీడర్,11 కెవి గొడుగు పాలెం ఫీడర్ లలో విద్యుత్ సరఫరా ఉండదని, కోర్ట్ సెంటర్ , సెంట్రల్ కేఫ్, శ్రీగిరి కొండమీద, రాజా పాలకాల రోడ్డు, లేబర్ ఆఫీసు రోడ్, జమ్మి చెట్టు బజారు, పోకల బజార్ ,సాయిబాబా టెంపుల్ ఎదురు, హరే రామ బజార్ , నారాయణ కాలేజ్ , ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ ,ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, గద్దలగుంట, విద్యుత్ సరఫరా అంతరాయంఉంటుందని విద్యుత్ శాఖ ఒంగోలు డి ఈ ఈ కెవి పాండురంగారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున వినియోగదారులు గమనించు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

# ధగధగ కాంతులతో మెరిసిన కందుకూరు

### -ఓవీ రోడ్డులో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన ఇంటూరి -అంబేద్కర్ విగ్రహం దగ్గర శిలాఫలకం ఆవిష్కరణ





**కందుకూరు పెన్ పవర్, మార్చి 7**

కందుకూరు పట్టణంలోని ఓవీ రోడ్డులో కొత్తగా నిర్మించిన డివైడర్, రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ ను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శనివారం సాయంత్రం ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి కోటారెడ్డి హాస్పటల్ జంక్షన్ వరకు సుమారు 3.8 కోట్ల రూపాయల ఖర్చుతో కొత్తగా ఏర్పాటు చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని, హాస్పిటల్ జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన సర్కిల్ ఐమాక్స్ లైటింగ్ ను సబ్ కలెక్టర్ హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ అనూషతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే స్విచ్ ఆన్ చేయడంతో ఓబి రోడ్డు మొత్తం ఒక్కసారిగా విద్యుత్తు కాంతులతో ధగధగలాడిపోయింది. పట్టణవాసులు, నియోజకవర్గంలోని ఇతర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు చప్పట్లతో కొత్త వెలుగులకు స్వాగతం పలికారు. ఇంటూరి నాగేశ్వరరావు జయహో అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆర్యవైశ్యులు, ముస్లింలు, ఇంకా పరివర్గాల ప్రజలు ఎమ్మెల్యే పై పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. అంతకుముందు ఎమ్మెల్యే సహా నేతలందరూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రారంభోత్సవ అనంతరం ఎమ్మెల్యే సహా అధికారులు, నాయకులు, కార్యకర్తలు అందరూ... అంబేద్కర్ విగ్రహం నుంచి హాస్పిటల్ జంక్షన్ వరకు నడుచుకుంటూ, మధ్యలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న డివైడర్ ను ఏర్పాటు చేయటం నా అదృష్టంగా భావిస్తున్నాను. అత్యధికంగా సుమారు ఎనిమిది వేల మెజారిటీ ఇచ్చిన పట్టణవాసుల రుణం తీర్చుకోలేనిది. హైదరాబాదులో వ్యాపారం చేస్తూ, కందుకూరుకు వచ్చినప్పుడల్లా పట్టణంలో రోడ్ల పరిస్థితి చూసి చాలా బాధపడేవాడిని. ఎమ్మెల్యే అయ్యాక, ఏది ఏమైనా సరే, పట్టణ రూపురేఖలు మార్చాలని మనసులో గట్టిగా నిర్ణయించుకున్నాను. ఇలాంటి అభివృద్ధి ఇకముందు జరుగుతూనే ఉంటుంది. టిడిపి అధికారంలోకివస్తే పట్టణంలో ఏదో జరిగిపోతుందని 20 ఏళ్ల నుంచి అబద్ధాలు ప్రచారం చేశారు. నేను ఎమ్మెల్యే అయిన వెంటనే, శాంతిభద్రతల విషయంలో రాజీలేదని చెప్పాను. ఈ 20 నెలలనుంచి కఠినంగా వ్యవహరిస్తున్నాను. ఇకముందు కూడా ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి రానివ్వనని మాట ఇస్తున్నాను. సరిగ్గా ఏడాది క్రితం చంద్రబాబు కందుకూరుకు వచ్చినప్పుడు 50 కోట్లు ప్రకటించారు. ఆ నిధులతో పట్టణ సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. ఇంకా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు కూడా వేగంగా జరుగుతున్నాయి అని అన్నారు. కందుకూరు పట్టణానికి నాలుగు వైపులా పార్కులు ఏర్పాటు చేయబోతున్నాను. ప్రజలకు అభివృద్ధితో పాటు ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం కూడా ఎంతో అవసరం. పార్కుల కోసం స్థలాలు గుర్తిస్తున్నాం. త్వరలోనే వాటిని ప్రజలకు అందుబాటులోకి తెస్తాం అని అన్నారు. కందుకూరు మండలంలోని పలు గ్రామాలకు జల జీవన్ మిషన్ ద్వారా 22 కోట్లతో రామతీర్థం తాగునీటిని అందించే పనులు జరుగుతున్నాయి. మరో ఏడాదిలోపే ప్రజలకు తాగునీరు అందుతుంది అని అన్నారు. గత ఐదేళ్లలో దారుణంగా ప్రవర్తించారు కాబట్టే, వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కలేదు. గెలిచిన 11 మంది కూడా అసెంబ్లీకి రాకుండా, శాసన మండలిలో గందరగోళం చేస్తున్నారు. ప్రజల మధ్య గొడవలు సృష్టించి, రాజకీయం చేయాలన్నది జగన్మోహన్ రెడ్డి మనస్తత్వం అని అన్నారు. వైసిపి నేతల ప్రవర్తనలో ఇంకా మార్పు రాలేదు. వారి వ్యవహార శైలి చూస్తుంటే ఇంకా మారరనిపిస్తోంది అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేసుకుంటూ పోతున్నాను. సంపూర్ణ అభివృద్ధి చేసిన తరువాతే, 2029 లో ఎన్నికలకు వెళ్లి ఓట్లు అడుగుతాను. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి, నారా లోకేష్ కి, పవన్ కళ్యాణ్ కి, మంత్రులకు నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో కందుకూరు పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బస్సారెడ్డి కృష్ణారెడ్డి, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, జనసేన నాయకులు తిరుపాలు, కళ్యాణ్, టీడీపీ నాయకులు చల్లా శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, కాంట్రాక్టర్లు రావూరి రామకోటయ్య, గల్లా శ్రీనివాసరావు, అల్లం వెంకటేశ్వర్లు, గొంది నరసింగ రావు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, పోకూరి రాంబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, కంద్రా మాల్యాద్రి, షేక్ రూబీ, షేక్ రఫీ, షేక్ మున్న, బెజవాడ ప్రసాద్, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కూటమి నాయకులు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## భ్రూణ హత్యల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలి

### పి.సి అండ్ పి.ఎన్.డి.టి చట్టాల పై అవగాహణ అవసరం.

### షేక్ లూనా జబిన్ తెలుగుదేశం పార్టీ నాయకురాలు.





**పామూరు, పెన్ పవర్, మార్చి7**

ఇటీవలి కాలంలో మన దేశంలో గణాంకాలు పరి శీలిస్తే ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతున్నది. కాలానుగుణంగా వస్తున్న మార్పులు వల్ల దంపతులు మగపిల్లాడు పుడితే బాగుంటుందని భావించడం వల్ల ఆడపిల్లల భ్రూణ హత్యలు జరుగుతున్నా కారణంగా ఇలాంటి హత్యలను నిలువరించేందుకు ప్రభుత్వం 1994లో పిసి పీఎన్డీటీ (గర్భస్థ పిండ పరీక్ష నివారణ) చట్టాన్ని తీసుకొచ్చిందని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు లోన జబన్ పేర్కొన్నారు. ఈ చట్టం పై పూర్తిస్థాయిలో అవగాహనతో అక్రమ లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై సమాచారం అందించడానికీ సమాజంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా ఈ చట్ట అమలుకు సహకరించాలని తెలుగుదేశం పార్టీ నాయకురాలు షేక్ లూనా జబిన్ అన్నారు. సమాజంలో చదువుకున్నవారు, అధికారులు, మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామీణ, మండల, పట్టణ ప్రాంతాల ప్రజలకు భ్రూణ హత్యలను నివా రించడానికి అవగాహన పెంచాలి. గ్రామ, మండలాల్లో నిర్వహించె సమావేశాలలో భ్రూణ హత్యలవల్ల జరిగే ప్రమాదాల పై సమాజంలో ప్రతి ఒక్కరూ ఆలోచనా విధానం మార్పురావాలి. పురుష, మహిళ లింగ వివక్షత లేని సమాజం ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని లూనా జబిన్ తెలిపారు. మగవారికి ఏమాత్రమూ తీసిపోని విధంగా ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణిస్తున్నప్పటికీ వారి పట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతూనే ఉందని ఆమె అన్నారు. మహిళ గర్భం దాల్చిన తర్వాత పుట్టబోయేది ఆడ, మగ తెలుసు కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. తెలుసుకున్నవారితో పాటు తెలిపినవారు శిక్షార్హులు. కానీ కొన్ని చోట్ల ఈ నిబంధనలు తుంగలో తొక్కి లింగ నిర్ధారణ చేసి ఆడబిడ్డల హత్యలకు కారణమవుతున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరం అని తెలిసినా సరే భ్రూణ హత్యలు యథేచ్ఛగా కొన సాగుతున్నాయన్న విషయం బాలికల నిష్పత్తి తగ్గటమే నిదర్శమని షేక్ లూనా జబిన్ తెలిపారు. ప్రస్తుత సమాజంలో బాలికల సంఖ్య తగ్గుతున్నది. మహిళా నిష్పత్తి తగ్గటం వల్ల ప్రమాదకర భవిష్యత్తు సూచిస్తుందని లింగపరంగా అసమతుల్య స్థితి ఉంటే సమాజంలో అనేక ఇబ్బందులు పెరిగే ప్రమాదం ఉందని, కావున లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలు సమాజంలో మంచి మార్పు కోసం పారదర్శకంగా, బాధ్యతతో పనిచేయాలి. ఆడ మగ ఇద్దరూ సమానసమేనని, లింగ వివక్ష చూపడం నేరమేనని అన్నారు. ఆడబిడ్డలను పుట్ట నిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దాం. కడుపులో ఉన్నది ఆడ శిశువు అని తెలియగానే అబార్షన్ మొదలైన పద్ధతుల ద్వారా ఆ పిండాన్ని తొలగించడం స్త్రీల పట్ల వివక్షను చూపుతుందని, స్త్రీల ఆత్మగౌరవానికి వ్యతిరేకమని ఈ చట్టం భావిస్తుంది. ఈ విషయంలో దంపతుల ఆలోచనల్లో పూర్తిగా మార్పులు రావాలని లూనా జబిన్ తెలిపారు.

## మహిళా దినోత్సవ వేడుకలు



**పామూరు, పెన్ పవర్,మార్చి7**

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం మహిళా దినోత్సవం వేడుకలు ఐద్వా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఐద్వా మహిళలు కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రధాన ఉపాధ్యాయురాలు కటకం సజనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా షమ్మీ మాట్లాడుతూ మహిళలు ఎందులోనూ తక్కువ కాదని తెలిపారు. అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారిని ప్రోత్సహించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, శైలజ,వాణి, షమ్మీ, రమీజా,ఐద్వా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కిమ్స్ ఆసుపత్రిలో అరుదైన వ్యాధికి అద్భుతమైన చికిత్స



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి07**


ఒంగోలు లో ని కిమ్స్ హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ లో విభాగం వైద్యులు డా కానాల జగదీశ్వర్ రెడ్డి, డా. వేములపాటి అశోక్ కుమార్ ఒక అరుదైన చికిత్సతో వైద్య రంగం లో మరో విజయాన్ని అందుకున్నారు. ఆకలేషియా కార్డియా తో బాధపడ్తున్న 60 సంవత్సరాలు వయసు గల పురుషుడు, 24 సంవత్సరాలు వయసు వ్యక్తి పర్ ఓరల్ ఏండోస్కోపీ మాయొటోమి (పి ఓ ఇ యం ) చికిత్స ను విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రక్రియ ద్వారా ఎలాంటి కొత.. నొప్పి లేకుండ గత పది సంవత్సరాలు కంటే ఎక్కువుగా ఉన్న ఇబ్బంది ని ఒక్క రోజు లో అంతర్జాతీయ ప్రమాణాలతో వారికి కొత్త జీవితాన్ని అందించారు. ఆహారం, నీళ్లు కూడా మింగలేని పరిస్థితి లో రోగులు బాధిత రోగులు ఆహారం, ద్రవ పదార్థాలు మింగడం లో తీవ్రమైన ఇబ్బంది తో పది సంవత్సరాలు కంటే ఎక్కువుగా బాధపడ్తున్నారు. వారికి ఆకలేషియా కార్డియా నిర్ధారణ పరీక్షలు ( హెచ్ ఆర్ ఎం ఉమ్మడి ఒంగోలు, నెల్లూరు జిల్లాలో కిమ్స్ ఒంగోలు లో ని మొట్ట మొదటిసారిగా అందుబాటులో కలవు ) నిర్వహించి వ్యాధిని నిర్ధారణ చేశారు. విజయవంతంగా పి ఓ ఇ యం చికిత్స ఈ అరుదైన వ్యాధిని అంతర్జాతీయ ప్రమాణాల సాంకేతిక మరియు నైపుణ్య గల కిమ్స్ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య బృందం డా కానాల జగదీశ్వర్ రెడ్డి, డా. వేములపాటి అశోక్ కుమార్ ప్రత్యేక ఎండో స్కోపీ సాధానాలు ఉపయోగించి అన్న వాహిక లో ని కండరాలను విడతీసారు. తద్వారా మిండగానికి ఇబ్బంది గా ఉన్న అడ్డంకిని విజయవంతంగా తొలింగించారు. చికిత్స పూర్తయినా మరుసటి రోజు రోగి ఆహారము తీసుకునే స్థితికి చేకూర్చారు.

## ఘనంగా మహిళా శక్తి అవార్డ్స్ ప్రదానం



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు మార్చి07**

స్థానిక ఒంగోలు లోని హౌసింగ్ బోర్డు కాలనీలోని మహిళాభ్యుదయ సమితి ఆవరణలో శనివారం ఉదయం లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు, ఆంధ్రప్రదేశ్ మహిళా అభ్యుదయ సమితి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసభకు సంస్థ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ అధ్యక్ష వహించి మాట్లాడుతూ మహిళలు చైతన్య వంతులై తమ బ్రతుకుల్ని తామే తీర్చిదిద్దికుంటూ ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ప్రగతి వైపు ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సంస్థ నిర్వాహకులు, కె.కె. కంప్యూటర్స్ ప్రెసిడెంట్ వల్లేటి రవీంద్ర మాట్లాడుతూ మహిళల జీవితాల్లో వెలుగులు రావాలంటే తప్పకుండా ప్రతి ఒక్కరూ ప్రగతిని సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమెన్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎమ్ నాగమణి ప్రసంగిస్తూ స్త్రీ సహనానికి ప్రతీక అని, ఆమె శక్తి సమ సమాజ నిర్మాణానికి తోడ్పడుతుందని తెలిపారు. స్త్రీలు సామాజిక సేవా రంగంలోను,సంఘ సంస్కరణలోను తమ వంతు పాత్రను పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రేడియాలజిస్ట్.. ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ క్విజ్ క్విజ్ కళాశాల డా. యన్.గాయత్రి దేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పెంపకం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, లింగ భేదం లేకుండా చూడాలని,వారి అభివృద్ధి గురించి ఆలోచించాలని వివరించారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ చాపల శాంతకుమారి మాట్లాడుతూ స్త్రీల ఆరోగ్యం గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు.అనంతరం సమాజానికి తమ వంతు కృషి చేస్తున్న క్విస్ కాలేజీ అధ్యాపకురాలు డాక్టర్ దాయనేని ప్రవీణ,నాట్య కళాకారిణి అంబటి భవ్య శ్రీ, తదితరులకు మహిళా శక్తి అవార్డ్స్ ప్రదానం చేసి వారిని ఘనంగా సత్కరించారు. ముందుగా నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి సభాహ్వానం పలికారు . ఈ కార్యక్రమాన్ని మహిళాభ్యుదయ సమితి కోశాధికారి బీరం అరుణ పర్యవేక్షించగా, ఈ కార్యక్రమంలో కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, నాళం నరసమ్మ,తమ్మిశెట్టి రమాదేవి, వడ్డెంపూడి సుజాత,నూకతోటి శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com